

గుండె కోత : యు.కొత్తపల్లి మండలం మాయాపట్నంలో కోతకు గురవుతున్న మత్స్యకారుల గృహాలు

తుఫాన్..అలజడి!

అన్నదాతకు అకాల కష్టం



అయ్యో పాపం అన్నదాత : ముమ్మిడివరంలో ధాన్యం రాశి చుట్టూ చేరిన నీటిని మళ్లిస్తున్న రైతు

ఫెంగల్ తుఫాన్ అలజడి.. అన్నదాతల్లో బెంగ తెచ్చింది.. ఏ క్షణం ఎటువంటి కష్టం వస్తుందోనని ఆందోళన చెందుతున్నాడు.. ప్రతి ఏడాది ప్రకృతి అన్నదాతను వదలడంలేదు.. ఏదో ఒక విధంగా నష్టాల బాట పట్టిస్తూనే ఉంది.. ఈ ఏడాది ఏం భయం లేదనుకుంటే ఫెంగల్ తుఫాన్ వచ్చేసింది.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇంకా మాసూళ్లు సాగుతూనే ఉన్నాయి. దీంతో రైతుల్లో అలజడి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందేసరికి వాతావరణంలో వచ్చిన మార్పులతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ ఏడాది పంటలు బాగానే పండాయని సంతోషంలో ఉన్నరైతులను ఫెంగల్ తుఫాన్ ఉరుకులు.. పరుగులు పెట్టిస్తోంది... మరోవైపు సముద్రంలోనూ అలల తాకిడి పెరిగింది.. పరీవాహక ప్రాంత ప్రజలను భయపెడుతోంది..



రౌతులపూడిలో నేలవాలిన వరి చేను

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తుపాన్ భయపెడుతోంది..అకాల కష్టం అన్నదాతను ఆందోళనకు గురిచేస్తోంది.. మరోవైపు సముద్ర తీర ప్రాంతాల్లో అలజడి నెలకొంది.. తుపాన్ తీరం దాటినా భయం మాత్రం వీడడం లేదు. ఏ క్షణం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. చాలా గ్రామాల్లో పంట కోత దశలో ఉంది. కొన్ని చోట్ల పనల మీద, కుప్పలుగా ఏర్పడి ఉంది. పనలపై ఉన్న పంటను కుప్పలుగా వేసి టార్పాలిన్లు కప్పుతున్నారు. మరోవైపు పచ్చి మీద ఉన్న పంటను కుప్పలుగా వేస్తే ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే నూర్పులు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. తుపాన్ ప్రభావం కారణంగా వీచిన గాలులకు చాలా గ్రామాల్లో చేలు నేలవాలాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశంలో మబ్బులతోపాటు అక్కడక్కడ చిరుజల్లులు పడ్డాయి. దీంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. వాతావరణం మార్పుతో రైతులు వరికోతలు వాయిదా వేసుకున్నారు. గత రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

తూర్పున ఉరుకులు.. పరుగులు

రాజమహేంద్రవరం/గోకవరం/కడియం/సీతానగరం/ఉండ్రాజవరం/పెరవలి/దేవరపల్లి/గోపాలపురం,నవంబరు30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ తీరం దాటినప్పటికీ దాని ప్రభావంతో జిల్లా ఓ మోస్తరు వానతో పాటు చలిగాలులు వీచాయి. పొలాల్లోనే ధాన్యం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నా రు.మరో వైపు జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన చలిగాలులు వీయడంతో ప్రజలు వణికిపోతున్నారు. జిల్లాలో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం 49,583 హెక్టార్లలో వరి మాసూళ్లు చేయగా 3,22,855 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. రోజుకు సరాసరి 1240 హెక్టార్లలో మాసూళ్లు జరుగుతున్నాయి. ఇంకా కళ్లాల్లో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండి పోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం 30 వేల టన్నుల ధాన్యం కళ్లాలు, రోడ్లమీదే ఉంది. రాజమండ్రి రూరల్ మండలంలో 30 టన్నులు, కడియంలో 800 టన్నులు, రాజానగరంలో 1400, అనపర్తిలో 2300, బిక్కవోలులో 2800, కోరుకొండలో 1500, గోకవరంలో 1800, సీతానగరంలో 1400, రంగంపేటలో 1232, చాగల్లులో 1900, దేవరపల్లిలో 1400, గోపాలపురంలో 1400, కొవ్వూరులో 2138 టన్నులు, నిడదవోలులో 1900, పెరవలిలో 2100, తాళ్లపూడిలో 2200 టన్నులు, నల్లజర్లలో 1800 మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లో ఉంది. కళ్ళాల్లో ఉన్న ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం టి.రాధిక పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో పర్యటించి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులకు సూచించారు.



మండపేటలో ధాన్యం ఎగుమతి

పచ్చిధాన్యం కొనుగోలు

తుఫాన్ కారణంగా తేమశాతం 25 (తాజాగా నిర్ణయించింది) వచ్చేవరకు ఆరబెట్టుకునే అవకాశం రైతులకు లేనందున పంట చేలో ధాన్యం కోసిన వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించినట్టు సమాచారం. దీంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే గిట్టుబాటు ధర మాత్రం ఇవ్వడం లేదు. కాటాకు రూ.1500 వరకు మాత్రమే రైతులకు గిడుతోంది. దీని వల్ల కాటాకు రూ.250 నుంచి రూ. 300 వందల వరకు రైతులు నష్టపోతున్నారు. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాటాకు రూ.1750 చొప్పున జమ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలకే రైతుల ఖాతాల్లోకి సొమ్ములు పడుతున్నాయి.

- ఈసారి వదలని వాతావరణం
- ముంచుకొచ్చిన ఫెంగల్
- అన్నదాతకు మళ్లీ కష్టాలు
- చిరుజల్లులతో ఆందోళన
- రైతుల ఉరుకులు..పరుగులు
- కోనసీమలో అక్కడక్కడా వాన
- తూర్పును భయపెట్టిన వరుణుడు
- కాకినాడలో చెలరేగిన అలజడి
- ఉదయం నుంచి వీడని మబ్బు
- పచ్చిధాన్యమూ కొనుగోలు
- మూడు రోజులు కోతలకు బ్రేక్



అకాల కష్టం : గోకవరంలో టార్పాలిన్ల కింద దాచిన ధాన్యపు రాశులు

కోనసీమలో కంగారు

అమలాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో గత 24 గంటల నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తుంది. అన్నదాతలకు వర్షం కారణంగా కష్టాలు ఎదురయ్యాయి. మాసూళ్లు పూర్తికాకపోవడంతో వరి చేలల్లోనే పంట ఉండిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం తడిసి ముద్దవుతుండడం వల్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ఆర్డీవో కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తూనే ఉంది. వరిచేలల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని సంరక్షించుకునే పనిలో అన్నదాతలు బిజీగా ఉన్నారు. కొందరు రైతులు అతికష్టం మీద ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలిస్తున్నారు. కొన్నిచోట్ల మిల్లుల్లో ధాన్యం తీసుకునేందుకు నిరాకరిస్తున్నందున రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం రాత్రికి తుఫాన్ తీరం దాటితే వర్షాలు కురుస్తాయని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. కోతలు పూర్తయిన పంటను మిల్లులకు తరలించేలా అధికారులు, మిల్లర్లు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. అవసరమైన మేరకు రైతులకు త్వరగా టార్పాలిన్లు అందించే ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు తమ సమస్యలను కంట్రోల్ రూము సెల్ 8309432487, 9441692275కు సమాచారం అందిస్తే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. తుఫాన్ నేపథ్యంలో రైతులు మరో మూడు రోజులపాటు వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1,18,559 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. కోతలు పూర్తి అయి 14,417 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యానికి రూ.252 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

కాకినాడలో కలవరం

పిఠాపురం/సామర్లకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారిన నేపథ్యంలో శనివారం తెల్లవారుజాము నుంచి వాతావరణం మారిపోయింది. రోజంతా ఆకాశం మేఘావృతమై వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. మధ్యలో రెండు, మూడుసార్లు స్వల్పంగా వర్షం కురిసింది. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఈదురుగాలుల ప్రభావం అధికంగా ఉంది. పిఠాపురం నియోజకవర్గంలోని ఏలేరు, పీబీసీ ఆయకట్టుతోపాటు మెట్ట ప్రాంతాల్లో కోతలకు సిద్ధంగా వరిపంట పలుచోట్ల నేలకొరిగింది. మాసూళ్లు జరిగిన ప్రాంతాల్లో అక్కడక్కడ ధాన్యం రాశులు కళ్లాల్లో ఉండి పోయాయి. ఈ ధాన్యాన్ని వర్షానికి తడవకుండా టార్పాలిన్లు, బరకాలు కప్పి నీరు నిలవకుండా రైతులు బాటలు తీస్తున్నారు. తుఫాను ప్రభావం జిల్లాపై అంతగా ఉండదని వాతావరణశాఖ చెప్పినా అందుకు భిన్నంగా ఎక్కువగా ఉండడం రైతులను కలవరానికి గురిచేస్తోంది. తీరం దాటిన తర్వాత దీని ప్రభావం లేకుండా ఉంటే నష్టం జరగకుండా గట్టెక్కుతామని రైతులు ఆశిస్తున్నారు. అలాగే కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను భద్రపరుచుకునేందుకు ప్రభుత్వం టార్పాలిన్లు, బరకాలు సరఫరా చేస్తే రైతులను కొంతమేర ఆదుకున్నట్టు అవుతుందని సామర్లకోట ప్రాంతంలోని రైతులు చెబుతున్నారు.




కన్నీటి సంద్రమే : ఉప్పాడ కొత్తపల్లి మండలం మాయాపట్నంలో సముద్రంలో కొట్టుకుపోయిన ఇల్లు

భయం గుప్పిట తీరం

కొత్తపల్లి/అమలాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను తీరం దాటినా ఉప్పాడ తీరంలో సముద్రం తీవ్ర స్థాయిలో ఎగిసిపడుతోంది. శనివారం ఉదయం నుంచీ తీరం వెంబడి బలమైన ఈదురు గాలులతో పాటు వర్షం కురుస్తోంది. సముద్రం ఉప్పొంగుతూ మూడు నుంచి నాలుగు మీటర్ల ఎత్తులో కెరటాలు ఒడ్డుకు దూసుకొస్తున్నాయి. ఉప్పాడ శివారు మాయాపట్నం, సూరాడపేట, కొత్తపట్నం, సుబ్బంపేట గ్రామాల్లో ఒడ్డునే ఉన్న మత్స్యకారుల ఇళ్లల్లోకి అలలు పోటెత్తు తున్నాయి.ఇప్పటికే నాలుగు మత్స్యకారుల ఇళ్లు సముద్రగర్భంలో కలిసిపోగా, మరికొన్ని కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి.అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరంలో కోత ఎక్కువగా ఉండి సముద్రం ముందుకు చొచ్చుకువచ్చింది. ఫలితంగా సముద్రం చెంతనే ఉన్న సముద్ర రిసార్ట్ కోతకు గురయ్యే ప్రమాదకర పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. పక్కనే ఉన్న ఓఎన్జీసీ ప్లాంట్‌ను సముద్ర కెరటాలు తాకుతున్నాయి. మరో 48 గంటల పాటు వాతావరణం అనుకూలించే అవకాశం లేక మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని జిల్లా అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

ముందుకొచ్చిన సముద్రం

అలల అలజడి భారీగా కోత



ఓడలరేవు బీచ్ రిసార్ట్స్ సమీపంలో కోతకు గురైన భూమి

అల్లవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు సముద్రతీరంలో రాకాసి అలల ధాటికి ఇసుకతిన్నెలు భారీగా కొట్టుకుపోయాయి. సముద్రం సుమారు పదిమీటర్లు ముందుకు వచ్చింది. తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలలో తీర ప్రాంతానికి రక్షణగా ఉన్న ఎత్తైన ఇసుక తిన్నెలు అలల ధాటికి కోతకు గురై కొట్టుకుపోయాయి. ఓడలరేవు తీర గ్రామానికి ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్స్‌కు, గెయిల్ జీసీఎస్‌కు, ప్రైవేటు బీచ్ రిసార్ట్స్‌కు ముంపు పొంచి ఉంది. ఫెంగల్ తుఫాన్ ముందస్తు హెచ్చరికగా ప్రమాదఘంటికలు మోగిస్తోంది. ఓడలరేవు తీరంలో సముద్ర బీచ్ రిసార్ట్స్ భవనాల సమీపం వరకు భూమి భారీ కోతకు గురై ప్రమాదభరితంగా మారింది. కిలోమీటర్ల పొడవునా తీరభూమి కనుమరుగైంది. అలల ధాటికి తాటి, కొబ్బరి, సరుగుడు చెట్లు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. గతంలో నరికేసిన సరుగుడు తోటల మోడులు, ఆక్వా చెరువుల బోరుపైపులు బయటపడ్డాయి. 2017లో ఓడలరేవు పర్యాటక కేంద్రంగా తీరంలో వేసిన శిలాఫలకం సాక్షిగా తీరభూమి కనుమరుగైంది. గడిచిన 20 ఏళ్లలో 800 మీటర్ల మేర తీర భూమి సముద్రం పాలైంది. గతంలో రెవెన్యూ, మత్స్య శాఖల అలసత్వంతో సీఆర్‌జెడ్ పరిధిలో ఆక్వా చెరువుల ఇసుక తవ్వకాలే మరింత ప్రమాదాన్ని తెచ్చిపెట్టాయి. తుఫాన్ దెబ్బతో సముద్ర అలలు గంటగంటకు పెరిగి తీరభూమి భారీగా కబలిస్తూ బీభత్సం సృష్టించాయి. ఓడలరేవులో అటవీ శాఖ భూమి, రైతుల జిరాయితీ భూములు కొట్టుకుపోయాయి. తీరప్రాంత రక్షణను ప్రభుత్వాలు గాని, ఓఎన్జీసీ అధికారులు కానీ పట్టించుకోలేదని ఇంత ప్రమాదం పొంచి ఉన్నా పరిశీలించిన దాఖలాలు లేవని విమర్శిస్తున్నారు. తుఫాన్ పరిస్థితుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణ మోహన్ అత్యవసర సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఫసల్ బీమాతో రైతులకు ధీమా

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అమలాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతులకు భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేస్తున్నాయని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. వ్యవసాయ ఆదాయ స్థిరీకరణ, రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు బీమా యోజన పథకం ఉపయోగపడుతుందని శనివారం ఆయన తెలిపారు. పథకంపై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించుకోవాలన్నారు. పథకం అమలు విధివిధానాలు, ఎంపిక చేసిన పంటలు, బీమా యూనిట్లు, ప్రీమియం రేట్లు, పరిహారాన్ని లెక్కించే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. రైతులు తమ పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు కామన్‌మేన్ సర్వీస్ సెంటర్‌లో రబీ క్రాప్ట్ ఇన్సూరెన్సు పోర్టల్ లాగిన్ ఇప్పటికే ఓపెన్ అయిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీమా పథకం కోసం ఆధార్‌కార్డు, పొలం పాస్‌బుక్కు జిరాక్సు, బ్యాంకు అక్కౌంట్ జిరాక్సు, రైతు సేవా కేంద్రంలో సాగు సర్టిఫికెట్, రైతులు ఫోన్ నంబరు పత్రాలను తీసుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. కౌలు రైతులకు కూడా ఫసల్ బీమా పథకం వర్తిస్తుందన్నారు. అయితే కౌలు రైతు కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.42 వేలు బీమా మొత్తానికి రూ.126 ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబరు 31లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. పంట రుణం తీసుకుంటే నేరుగా బీమా కంపెనీకి ప్రీమియం చెల్లిస్తుందని, రుణం తీసుకోని రైతులు మాత్రం ప్రీమియంను కామన్ సర్వీసు సెంటర్‌లో, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ ద్వారా చెల్లించవచ్చునన్నారు. ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం రైతు సేవా కేంద్రాలు, మండల వ్యవసాయ సిబ్బందిని సంప్రదించవచ్చునన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరా చేయాలి

కాంట్రాక్టర్లను ఆదేశించిన కలెక్టర్ మహేష్‌కుమార్



ఊబలంక పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అమలాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డిమాండ్‌కు అనుగుణంగా ఇసుకను సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఇసుక తవ్వకాలు నిర్వహించే కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం రావులపాలెం మండలం ఊబలంక ఆర్ఎస్ఆర్ ఏజెన్సీ నిర్వహిస్తున్న ఇసుక స్టాకు పాయింట్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుందని ఎటువంటి అవకతవకలు లేకుండా నిర్దేశించిన మేరకు ఇసుక తవ్వకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఊబలంక ఇసుక ర్యాంపు నుంచి సుమారు 64,800 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చామన్నారు. ప్రతీరోజు 500 మెట్రిక్ టన్నుల మేర ఇసుకను తవ్వి వినియోగదారులకు అందుబాటులో ఉంచే విధంగా సంబంధిత ఏజెన్సీలను ఆదేశించామన్నారు. స్టాకు పాయింట్ వద్ద రేయింబవళ్లు ఇసుక కార్యకలాపాలు జరిగేలా ఏజెన్సీలు చూడాలన్నారు. ఇసుక ర్యాంపు వద్ద మాత్రం నిర్దేశించిన సమయంలోనే తవ్వకాలు జరగాలన్నారు. ఇసుక అవసరమైన వారందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ర్యాంపు నుంచి స్టాకు పాయింట్‌కు ఎంత ఇసుక వస్తుంది, ఎంతమేర వినియోగదారులకు అందిస్తున్నారో రికార్డులను పరిశీలించారు. ఇసుక లోడింగ్, రవాణా పరంగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని ఏజెన్సీలు, అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. రావులపాలెం తహశీల్దార్ ఎం.ముక్తేశ్వరరావు, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా నుంచి ధాన్యం సేకరణ: జేసీ



అమలాపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో రైసు మిల్లులు తక్కువగా ఉండడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించి తుఫాన్ కారణంగా ప్రత్యేక ఆదేశాలు ఇచ్చినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ ప్రాంత రైతులను కూడా ఆదుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రధానంగా కృష్ణాజిల్లా మొవ్వ, తోట్ల వల్లూరు మండలాల నుంచి ధాన్యం సేకరించేందుకు ఇద్దరు పౌరసరఫరాల అధికారులను నోడల్ అధికారులుగా నియమించామన్నారు. శనివారం నుంచే ధాన్యం సేకరణకు చర్యలు చేపట్టినట్టు ఆమె స్పష్టం చేశారు. కోనసీమ జిల్లాలో ధాన్యం సేకరణ అత్యంత వేగవంతంగా జరుగుతుందని జేసీ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణలో నిమగ్నమైన పౌరసరఫరాల సిబ్బంది మరింత మెరుగైన పనితీరు కనబరిచేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ జరపాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బాలసరస్వతి, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి పాల్గొన్నారు.

డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో విచారణ

ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు వైద్యులు, వైద్య సిబ్బంది నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ వైద్య శాఖ వాట్సాప్ గ్రూపులో హల్‌చల్ చేయడంపై జిల్లా వైద్యాధికారి ఎం.దుర్గారావుదొర విచారణ చేపట్టారు. జిల్లాలోని తాటిపాక, రామేశ్వరం, మోరిలకు చెందిన వైద్యాధికారులు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిబ్బంది అక్రమ వసూళ్లపై వాట్సాప్‌లో మెసేజ్‌లు పోస్టింగ్ చేయడంతో వైద్యాధికారులు ముగ్గురిని విచారణ నిర్వహించగా కార్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురు గుమస్తాలు, బిల్లులు చెల్లింపు నిర్వహించే ఇద్దరు గుమస్తాలు జూనియర్ అసిస్టెంట్ ఒకరు ఈ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు వైద్యాధికారుల ద్వారా తేలిందని డీఎంహెచ్‌వో దుర్గారావుదొర ఆంధ్రజ్యోతికి తెలిపారు. అయితే ఆ ఉద్యోగులపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించడంతో సోమవారం ఫిర్యాదు చేస్తామని వైద్యాధికారులు తెలిపినట్టు జిల్లా వైద్యాధికారి తెలిపారు. తాము నిర్వహించిన ప్రాథమిక విచారణలో డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు లీవ్‌ల మంజూరు, మెటర్నటీ లీవ్‌లు, సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి విషయాల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్టు తేలిందని, దీంతో తనకు ఏవిధమైన ప్రమేయం లేదని డీఎంహెచ్‌వో తెలిపారు. అయితే ప్రాథమిక నివేదికను ఇప్పటికే రీజనల్ డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు నివేదించామన్నారు. అయితే అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఉద్యోగులపై విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నట్టు డీఎంహెచ్‌వో తెలిపారు.

చివరి రోజు క్రికెట్ పోటీలు వాయిదా

అమలాపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడా పోటీలు ఫెంగల్ తుఫాన్ కారణంగా చివరిరోజు ఆటలను వాయిదా వేసినట్టు ఆర్గనైజింగ్ కార్యదర్శులు తోట రవి, గోవిందరావు తెలిపారు. ఈ నెల 28వ తేదీన రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. చివరిరోజు శనివారం క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించాల్సి ఉంది. ఉదయం నుంచి తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తుండడంతో పోటీలను వాయిదా వేసినట్టు ప్రకటించారు. త్వరలోనే పోటీలు ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు హాజరు కాగా ఐదు జట్లు క్వార్టర్ ఫైనల్స్ స్థాయి వచ్చేసరికి వెనుదిరిగాయి. ఇక ఎనిమిది జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అడబాల విజయ్‌శ్రీనివాస్, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కామన మధుసూదనరావు తెలిపారు.

వర్షపాతం వివరాలు

అమలాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫెంగల్ తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తుండగా సగటున 16.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కాట్రేనికోన మండలంలో 38.8, అత్యల్పంగా మండపేటలో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురం 1.8, రాయవరం 2.2, రామచంద్రపురం 2, ఆలమూరు 2.4, రావులపాలెం 7.2, కొత్తపేట 11.4, కపిలేశ్వరపురం 6, కె.గంగవరం 5.6, ఐ.పోలవరం 27.4, ముమ్మిడివరం 26.6, అయినవిల్లి 22.8, పి.గన్నవరం 17, అంబాజీపేట 15.4, మామిడికుదురు 24.2, రాజోలు 21.8, మలికిపురం 36.2, సఖినేటిపల్లి 16, అల్లవరం 28.2, ఉప్పలగుప్తం 20, అమలాపురం మండలంలో 27.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రికార్డు స్థాయిలో సత్యదేవుని వ్రతాలు

వివరాలు..7లో



నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

హెచ్ఐవీ నిర్మూలనకు చైతన్యమే చికిత్స

● విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ● అందుబాటులో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సేవలు ● ఏటేటా తగ్గుతున్న పాజిటివ్ కేసులు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 29, (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఎయిడ్స్ పేరు చెబితే వణికిపోయేవారు. ఎయిడ్స్ మహమ్మారిన పడిన బాధితులపై సమాజంలో తీవ్ర వివక్ష ఉండేది. ఎయిడ్స్‌తో మరణాలు అధికంగా ఉండేవి. ఎయిడ్స్ వ్యాధి విస్తరణపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో ఏటేటా రోగుల సంఖ్య తగ్గుతోంది. ఎయిడ్స్ బాధితుల నుంచి చిన్నారులకు సోకకుండా ముందస్తు వైద్య ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చిన్నారులకు సైతం పాజిటివ్ సంఖ్య తగ్గినట్టు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచడం, ఈ వ్యాధితో మృతి చెందినవారిని స్మరించుకోవడం, ఎయిడ్స్ వ్యాధి కారక హెచ్ఐవీకి వ్యతిరేకంగా పోరాడటం కోసం ఏటా డిసెంబరు 1వ తేదీన ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం జరుపుకుంటున్నాం. ఎయిడ్స్ అనేది స్వలింగ సంపర్కం, రక్షణ లేని విధంగా ఇతరులతో సెక్స్ వర్కర్లతో సెక్స్‌లో పాల్గొనడం, మాదకద్రవ్యాల వాడకం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా విటులు, దూరప్రాంతాలకు డ్రైవింగ్ చేసే డ్రైవర్లు, వలసలకు వెళ్లిన వారు సెక్స్ వర్కర్లతో కండోమ్ లేకుండా సెక్స్‌లో పాల్గొనడం ద్వారా ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ఎయిడ్స్, హెచ్ఐవీపై విస్తృతంగా అవగాహన పెరగడంతోపాటు వైరస్‌ను సమర్థంగా తిప్పికొట్టే నాణ్యమైన ఏఆర్‌టీ మందులు అందుబాటులోకి వచ్చాయి. ఈ మందులను ప్రభుత్వమే ఉచితంగా ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా బాధితులకు పంపిణీ చేస్తోంది. బాధితుల జీవన ప్రమాణ స్థాయి, నాణ్యమైన ఆరోగ్యం కోసం దాతలు, సంస్థలు పౌష్టికాహారం పంపిణీ చేయడంతో బాధితుల ఆరోగ్య స్థాయి పెరిగింది.

హెచ్ఐవీ అంటే..

హెచ్ఐవీ, ఎయిడ్స్ రెండు ఒకటేనని భావిస్తుంటారు. హెచ్ఐవీని నిర్లక్ష్యం చేస్తే అది ఎయిడ్స్‌గా మారుతుంది. హెచ్ఐవీ అనేది హ్యూమన్ ఇమ్యునో డెఫిసియెన్సీ వైరస్. ఇది శరీరంలోని రోగ నిరోధకశక్తిని నిర్వీర్యం చేస్తోంది. సీడీ-4 కణాలపై దాడి చేసి రోగనిరోధకశక్తిని హరిస్తోంది. దీంతో పలు రకాల అంటు రోగాలు సంక్రమిస్తాయి. కేన్సర్ బారినపడే ప్రమాదం ఉంది. హెచ్ఐవీ సోకిన కొన్నాళ్ల వరకు ఎటువంటి లక్షణాలు కనిపించవు. దాంతో దాంపత్య జీవితం గడపడంతో ఇది విస్తరిస్తోంది.

ఎలా సోకుతుంది...

హెచ్ఐవీ రక్తం, చనుబాలు, వీర్యం, జననాంగ స్రావాల ద్వారా ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది. నాలుగు మార్గాల ద్వారా ఇది సోకుతుంది. అసురక్షిత సంభోగం, ఓరల్ సెక్స్, సిరలోకి మాదక ద్రవ్యాల ఇంజెక్షన్లు, హెచ్ఐవీ సోకిన వారి రక్తమార్పిడి, తల్లి నుంచి బిడ్డకు సంక్రమిస్తోంది. గర్భిణీలకు ముందుగానే హెచ్ఐవీ పరీక్ష చేయడంతో యాంటీ రెట్రోవైరల్ (ఏఆర్‌వీ) మందులతో తల్లి నుంచి బిడ్డకు సోకకుండా చేయవచ్చు. జిల్లాలో డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణ కోసం కృషి చేస్తున్నారు. 1987 డిసెంబరు 1వ తేదీన దేశంలో మొట్టమొదటి హెచ్ఐవీ కేసును గుర్తించారు. ఈ ఏడాది ఎయిడ్స్ దినం హక్కుల మార్గాన్ని అనుసరించండి- నా ఆరోగ్యం, నాహక్కు. అనే నినాదంతో ముందుకు వెళతున్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినం సందర్భంగా ఎయిడ్స్ నిర్మూలనే ధ్యేయంగా అవగాహన కల్పించే దిశగా పయనించాల్సి ఉంది.

అక్టోబరు నాటికి కాకినాడ జిల్లాలో జనరల్, గర్భిణీలకు చేసిన హెచ్ఐవీ పరీక్షలు ఇలా..

సంవత్సరం	పరీక్షల సంఖ్య	పాజిటివ్‌కేసులు	శాతం	గర్భ పరీక్షలు	పాజిటివ్	శాతం
2022-23	78,592	1078	1.4	55,693	29	0.05
2023-24	63,736	1011	1.6	63,106	36	0.06
2024-25	44,745	632	1.4	28,095	13	0.05

కాకినాడ జిల్లాలో ఉన్న ఏఆర్‌టీ సెంటర్లలో చికిత్స పొందుతున్న బాధితులు

ఏఆర్‌టీ సెంటర్	పురుషులు	మహిళలు	టీఎస్/టీజీ	బాలురు	బాలికలు	మొత్తం
ఏఆర్‌టీ సెంటర్,జీజీహెచ్	5,370	6879	79	243	250	12,812
ఏఆర్‌టీ సెంటర్,తుని	1669	1927	24	47	71	3738
మొత్తం	7039	8806	103	290	321	16,559

'హక్కుల మన్ననను ఎంచుకుందాం..'



ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఏటా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక్కో నినాదాన్ని ప్రకటిస్తుంది. ఇందులో భాగంగా 2024కి సంబంధించి హక్కుల మన్ననను ఎంచుకుందాం (టేక్ ద రైట్స్ పాత్ టు ప్రీవెంట్ ఎయిడ్స్) నినాదాన్ని ఇచ్చింది. సమాజంలోని ప్రతి ఒక్కరి హక్కులను గౌరవించడం ద్వారా ప్రపంచంలో ఎయిడ్స్‌ను అంతం చేయవచ్చనే ఉద్దేశంతో ఈ నినాదాన్ని ప్రకటించారని ప్రముఖ ఎయిడ్స్ వైద్య నిపుణుడు డాక్టర్ యనమదల మురళీకృష్ణ చెప్పారు. మానవ హక్కుల మన్ననతో, వివిధ సమాజాల నాయకత్వంలో 2030 నాటికి ప్రపంచం ఎయిడ్స్‌ను ప్రజారోగ్య ముప్పుగా అంతం చేయగలమని లక్ష్యంతో పనిచేయాల్సి ఉందని తెలిపారు.

ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం రావాలి



హెచ్ఐవీ, ఎయిడ్స్ ముప్పు తొలగిపోలేదు. ఇప్పటికీ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 5 లక్షల మంది ఉండగా, 20 శాతం మంది రెండు తెలుగు రాష్ట్రాల్లోనే బాధితులు ఉన్నారు. హెచ్ఐవీ దీర్ఘకాలిక వ్యాధి. ఏఆర్‌టీ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడం ద్వారా వ్యాధి తగ్గి, ఆరోగ్యం మెరుగుపడడంతో సాధారణ జీవనం సాగిస్తున్నారు. హెచ్ఐవీ నుంచి ఎయిడ్స్‌గా ఇది రూపాంతరం చెందుతుంది. ప్రధానం సెక్స్ ద్వారా ఇది సోకుతుంది. మాదక ద్రవ్యాలు, సెక్స్ వర్కర్లతో వ్యాప్తిచెందుతోంది. విద్య, ఆరోగ్యం ప్రజల హక్కు, వైద్యం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడం, మహిళలు, ట్రాన్స్‌జెండర్స్ హక్కులను కాపాడగలిగితే వ్యభిచార గృహాలకు వెళ్లకుండా నివారించడం ద్వారా ఎయిడ్స్‌ని నివారించవచ్చు. జీవితభాగస్వామితో తప్పించి సెక్స్ వర్కర్లు, ఇతరులతో సెక్స్‌కు పాల్పడరాదు. కండోమ్‌తో సెక్స్ ద్వారా ఈ వ్యాధి బారిన పడకుండా కొంత మేర సంరక్షించుకోవచ్చు. తల్లి నుంచి బిడ్డకు సోకకుండా వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఎయిడ్స్‌ని నివారించవచ్చు. అవగాహనతో నియంత్రణ చేయవచ్చు.

- డాక్టర్ యనమదల మురళీకృష్ణ, హెచ్ఐవీ, దీర్ఘకాలిక వ్యాధుల నిపుణులు, కాకినాడ

పెళ్లికి ముందు హెచ్ఐవీ పరీక్ష శ్రేయస్కరం



పెళ్లికి ముందు మరో స్త్రీ లేదా ఎక్కువ మంది స్త్రీలతో లైంగిక సంబంధమైన సాన్నిహిత్యం కలిగి ఉంటే హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవడం శ్రేయస్కరం. టీబీ ఉన్నవారు, గర్భిణీలు కూడా హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలి. హెచ్ఐవీ పాజిటివ్ వచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచి ఏఆర్‌టీ సెంటర్లలో ఖరీదైన మందులు ఉచితంగా ఇవ్వబడతాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధితులను వివక్ష లేకుండా అందరితో సమానంగా ఆదరించమని అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇది దీర్ఘకాలిక వ్యాధి. దీనికి మందులున్నాయి. బాధితులను ఆదరిస్తూ వారి చేత క్రమం తప్పకుండా మందులు వాడిస్తే వారి జీవన విధానం మెరుగుపడడంతోపాటు వారి జీవిత కాలం పెరుగుతుంది.

- డాక్టర్ రోణంకి రమేష్, కాకినాడ జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి



నౌకలో పట్టుబడ్డ రేషన్ బియ్యం (ఫైల్‌ఫోటో)

రేషన్ మాఫియాలో వణుకు

- కాకినాడ పోర్టులో విదేశాలకు బియ్యం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదంతో గజగజ
- 16 షిప్పింగ్ కంపెనీలు అక్రమ బియ్యం వ్యాపారంలో కోట్లలో ఆర్జన
- మొత్తం కూపీ లాగుతుండడంతో ఎక్కడ దొరికిపోతామోనని కలవరం
- అటు బియ్యం అక్రమార్కులను వదిలేదిలేదన్న సీఎం హెచ్చరికతో బెంబేలు
- మాఫియాకు సహకారంపై పవన్ నిలదీతతో అధికారుల్లో వణుకుపాటు
- జిల్లా ఎస్పీపై పవన్ శివాలెత్తడంతో బదిలీ వేటు ఖాయమంటూ ప్రచారం
- డీఎస్‌వోపై కలెక్టర్ బదిలీ వేటుతో పౌరసరఫరాల శాఖలో గుబులు

రేషన్ బియ్యం మాఫియాపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదంతో అక్రమార్కులు అల్లాడుతున్నారు. తమ మాఫియా పునాదులు ఎక్కడ బయటపడిపోతాయోనని బెంబేలెత్తుతున్నారు. గడచిన అయిదేళ్లు అప్పటి వైసీపీ సర్కారు అండతో కోట్లు సంపాదించిన కొందరు వ్యాపారులైతే వణికిపోతున్నారు. ప్రభుత్వం మొత్తం కూపీ లాగుతుండడంతో బండారం బయటపడి కటకటాలకు వెళ్లాల్సి వస్తుందని కలవరపడుతున్నారు. ఇప్పటికే చెక్‌పోస్టులు ఏర్పాటుచేయడంతోపాటు రాత్రి నిఘా పెంచడంతో రేషన్ ఎగుమతికి దారులు మూసుకుపోయినట్టేనని గింజుకుంటున్నారు. 16 కంపెనీలు దందా కొనసాగిస్తున్నాయని, ఈ నెట్‌వర్క్ అంతుచూస్తామని తాజాగా డిప్యూటీ సీఎం పవన్ హెచ్చరికలతో పరిణామాలు ఎంతవరకు వెళ్తాయోనని గజగజలాడుతున్నారు. అటు రేషన్ అక్రమార్కులను వదిలిపెట్టబోయేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరికలతో బెంబేలెత్తుతున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పేదలకు పంచే రేషన్‌బియ్యాన్ని కాకినాడ కేంద్రంగా అక్రమార్కులు విదేశాలకు స్మగ్లింగ్ చేస్తూ ఏళ్ల తరబడి దర్జాగా సంపాదిస్తున్నారు. ప్రధానంగా కాకినాడ వైసీపీ కీలకనేత అయిన ద్వారంపూడి కుటుంబం, ఆయన అనుచరులు అడ్డుఅదుపూ లేకుండా గడచిన అయిదేళ్లలో అరాచకం సృష్టించారు. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి ప్రత్యేక నెట్‌వర్క్‌తో రేషన్‌బియ్యాన్ని కిలో ఆరు నుంచి పది వరకు కొనుగోలు చేసి కాకినాడ గోదాముల్లో లక్షల టన్నులు నిల్వ చేశారు. వీటిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా తమ అనుచరులు, సామాజికవర్గ మిల్లుల్లో గుట్టుచప్పుడు కాకుండా పాలిష్ చేసి ఆఫ్రికా దేశాలకు కాకినాడ యాంకరేజ్ పోర్టుమీదుగా తరలించేశారు. రేషన్ బియ్యాన్ని పాలిష్ ద్వారా మెరిసేలా చేసి ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి దేశాలకు దేశాలు దాటించేశారు. అక్కడ కిలో రూ.70కి విక్రయించి కోట్లకుకోట్లు కొల్లగొట్టేశారు. ఒకరకంగా చెప్పాలంటే పది లక్షల పెట్టుబడికి రూ.25 లక్షలు సంపాదించారు. అయితే కూటమి ప్రభుత్వం రాకతో వీరి నెత్తిమీద పిడుగు పడినట్టయింది. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే కాకినాడ, చుట్టుపక్కల గోదాముల్లో ఏకంగా రూ.157 కోట్ల విలువచేసే 52 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం పట్టుకుంది. దీంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. ఇన్నాళ్లు గోదాములు, మిల్లుల్లో ఇష్టానుసారం పాలిష్, ప్యాకింగ్ చేసిన దొంగలు ఒక్కసారిగా బెంబేలెత్తారు. అటు పోర్టు వద్ద రెండు చెక్ పోస్టులు ఏర్పాటుచేయడంతో దందా ఆగిపోతుందేమోనని భావించారు. కానీ ఎత్తుగడతో చెక్ పోస్టు సిబ్బందిని కాసులతో కొట్టేసి రేషన్ బియ్యం ఎగుమతి చేయడానికి ప్రయత్నించారు. తీరా అడ్డంగా నౌకలోను, బార్జిలోను రేషన్ బియ్యం దొరికిపోవడంతో కంగుతిన్నారు. స్వయంగా డిప్యూటీ సీఎం కాకినాడకు శుక్రవారం వచ్చి వీటిని పరిశీలించి 16 మంది బియ్యం ఎగుమతిదారులు రేషన్ స్మగ్లింగ్‌ను సామ్రాజ్యంలా నడిపిస్తున్నారని చెప్పడంతో ఇప్పుడు వీరంతా ఉలిక్కిపడుతున్నారు. ఈ నెట్‌వర్క్ తనను సైతం కాకినాడకు రాకుండా అడ్డుకోగలిగిందని చెప్పిన పవన్ దీన్ని వదిలిపెట్టనని, బియ్యం రవాణాపై పీడీ కేసులతోపాటు సీఐడీ లేదా సీబీఐతో స్మగ్లింగ్‌ను వెలికి తీస్తామని హెచ్చరించడంతో ముందు తమ అక్రమ రవాణా ఎక్కడ బండారం బయటపడుతుందోనని వణికిపోతున్నారు. ఈనేపథ్యంలో భవిష్యత్తులో విచారణ జరిగితే ఎక్కడా దొరకకుండా ఉండేందుకు తమ వద్ద రికార్డుల సాక్ష్యం లేకుండా జాగ్రత్తపడుతున్నారు. అటు ఢిల్లీస్థాయిలోను లాబీయింగ్‌కు ప్రయత్నాలు మొదలు పెట్టారు. వాస్తవానికి వైసీపీ అయిదేళ్ల పాలనలో కాకినాడ యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టు నుంచి రూ.950 కోట్ల విలువైన బియ్యం ఎగుమతులు జరిగాయి. ఇందులో సగానికిపైగా రేషన్ బియ్యం వ్యాపారమేనన్న అనుమానాలు ఉన్నాయి. దీంతో ఇదంతా నిగ్గుతేల్చడానికి ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రధానంగా ద్వారంపూడి సోదరుడు, ఆయన అనుచరులు తాజా పరిణామాలతో గజగజలాడుతున్నారు. ప్రధానంగా సరళా కంపెనీ పేరుతో బియ్యం ఎగుమతి చేసిన వినోద్ అగర్వాల్‌ను ఉద్దేశించి హారా ఈజ్ అగర్వాల్ అంటూ పవన్ బహిరంగంగా నిప్పులు కక్కడంతో సదరు వ్యాపారి బెంబేలెత్తిపోతున్నాడు. ఇలా అనేకమంది అక్రమార్కులు తాజా పరిణామాలతో ఏంచేయాలో తెలియక కలుగుల్లోకి దూరిపోతున్నారు. పైగా కాకినాడ రేషన్ స్మగర్లను వదిలిపెట్టనంటూ సీఎం చంద్రబాబు శనివారం హెచ్చరించడంతో ప్రభుత్వం ఈ మాఫియా పీచమణచడానికి ఎలాంటి అడుగులు వేస్తుందోనని తలపట్టుకుంటున్నారు.

వేటు ఎవరిపైనో...

రేషన్ స్మగ్లింగ్ మాఫియాకు కొందరు అధికారులు సహకరించడంపై పవన్ శుక్రవారం పోర్టులో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరుగా జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను ఉద్దేశించి పోర్టులో పరిణామాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించినా కనీసం స్పందించలేదని శివాలెత్తారు. తాను వచ్చిన ప్రతిసారీ ఎస్పీ సెలవులో వెళ్లిపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. అటు ఎస్పీ పనితీరుపై ఏమాత్రం సంతృప్తిగా లేని పవన్ సమర్థుడైన అధికారిని తేవాలనే ఆలోచనతో ఉన్నారు. ఈనేపథ్యంలో ఒకటిరెండు రోజుల్లో ఎస్పీపై వేటు వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కాకినాడ డీఎస్పీపైనా పవన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాఫియాను అడ్డుకోకుండా ఏంచేస్తున్నారని ధ్వజమెత్తగా ఆయన నీళ్లు నమిలారు. దీంతో డీఎస్పీ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోపక్క పౌరసరఫరాలశాఖలో అడుగడుగునా మాఫియాకు సహకరించేవారు అధికంగా ఉండడంతో పోర్టు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు అవినీతిమయంగా మారాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం రావడంతో కలెక్టర్ స్పందించి జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిపై బదిలీ వేటు వేశారు. దీంతో ఆ శాఖలో మిగిలినవారిలో వణుకు మొదలైంది. పాపాలకు ఫలితంగా ఎవరి కొలువుపై వేటు పడుతుందోననే చర్చ జరుగుతోంది. కాగా బార్జి, నౌకలో పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని శాంపిళ్లు తీసి అధికారులు ల్యాబ్‌కు పంపించారు.

అనుమానం రాకుండా... చేశారా..

తుపాను నేపథ్యంలో వర్షాలు కురుస్తుండడంతో పట్టుబడ్డ బియ్యాన్ని అధికారులు బార్జి, నౌకలోనే వదిలేశారు. కాగా జూలైలో పట్టుబడ్డ ఈ రేషన్ బియ్యాన్ని సదరు వ్యాపారులు న్యాయస్థానం ద్వారా బ్యాంకు గ్యారెంట్‌లు చెల్లించి విడిపించి తెచ్చుకున్నారు. ఈలోపు ఇంతలో అదే బియ్యాన్ని మళ్లీ విదేశాలకు అంత ధైర్యంగా ఎలా ఎగుమతి చేస్తారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఆ బియ్యం విదేశాలకు వెళ్లడం నిషిద్ధం అయినప్పుడు అధికారుల్లో ఎవరి సహకారంతో ఇది దేశం దాటి వెళ్లడానికి ప్రయత్నం జరిగిందనేదానిపై చర్చ జరుగుతోంది. అయితే విడిపించుకున్న ఈ బియ్యాన్ని సదరు స్మగ్లర్లు మిల్లుల్లో మళ్లీ పాలిష్ చేసి ఇతర బియ్యంతో మిక్సింగ్ చేసి అనుమానం రాకుండా విదేశాలకు ఎగుమతి చేయడానికి ప్రయత్నించారు. ఈలోపు కలెక్టర్ శాన్‌మోహన్‌కు అనుమానం వచ్చి తనిఖీచేయడంతో బండారం బద్దలైంది.

బియ్యం శాంపిల్స్ పరీక్షిస్తున్నాం

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ యాంకరేజ్ పోర్టులో నౌకలో సేకరించిన బియ్యం శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపి పరీక్షిస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి డీఎస్‌వో ప్రసన్న లక్ష్మీదేవి తెలిపారు. అలాగే కరప మండలం నడకుదురులో సీజ్ చేసిన బియ్యాన్ని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌లో ఉంచామన్నారు. ఫలితాలు వచ్చిన తర్వాత పీడీఎస్ బియ్యం ప్రకటిస్తామన్నారు.

రేపటి నుంచి మాధవపట్నం రైలు గేటు మూసివేత

సామర్లకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-కాకినాడ ప్రధాన రైలుమార్గంలో సర్పవరం రైలు గేటుగా గుర్తింపు పొందిన మాధవపట్నం రైలు గేటును డిసెంబరు 2నుంచి 11వరకూ మూసివేయనున్నట్టు కాకినాడ రైల్వే ఎస్ఎస్ఈ పబ్లిక్‌వే మార్ని రమేష్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రైలుగేటు వద్ద ఎల్‌సీ పోర్షన్ ట్రాక్ రోడ్డు మరామ్మత్తుల దృష్ట్యా రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఔషధ మొక్కల పెంపకం లాభదాయకం

● ఉద్యానవన విశ్వవిద్యాలయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు

వై.రామవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కల పెంపకం చేపట్టాల్సిన మెళకువలపై ఉద్యానవన విశ్వవిద్యాలయ పరిశోధన కేంద్రం(వెంకటరామన్నగూడెం)శాస్త్రవేత్తలు శనివారం మండలంలోని తోటకూరపాలెంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ టి.నాగలక్ష్మి, డాక్టర్ జి.రంగన్న, డాక్టర్ ఎస్.ఆదర్శ ఔషద గుణాలున్న అశ్వగంధ మొక్కలు సాగుచేసే విధానంపై మెళకువలు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వీటిని సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని వాటిని మార్కెటింగ్ చేసే విధానంపైన రైతులకు అవగాహన కల్పించారు. ఎస్ఏఎఫ్ కోఆర్డినేటర్ కె.సతీష్, సభ్యులు సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నమ్ములు, వైఎస్ఆర్ విశ్వ విద్యాలయ పరిశోధకులు, రైతులుపాల్గొన్నారు.

గోవిందా.. గోవింద

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.45.44లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర ఆర్జిక సేవలు నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. సినీనటుడు దివంగత రెబల్‌స్టార్ కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కార్తీక ఆఖరి శనివారం కావడంతో వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించారు.అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.45.44252 లభించినట్టు ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



సుప్రభాత సేవలో భక్తులకు స్వామివారి హారతి చూపిస్తున్న అర్చకులు



సినీనటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం



శిక్షణకు హాజరైన అధికారులతో అటవీశాఖ అధికార్లు

అన్ని నర్సరీలకు అక్రిడిటేషన్ తప్పనిసరి

టీఓఎఫ్ఐ రాష్ట్ర కోఆర్డినేటర్ అజిత్ చోనాచలం

దివాన్‌చెరువు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయం మేరకు రాష్ట్రంలోని అన్ని నర్సరీలు తప్పక అక్రిడిటేషన్ పొందాలని ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్స్ ఇన్ ఇండియా (టీఓఎఫ్ఐ) రాష్ట్ర కోఆర్డినేటర్ అజిత్ చోనాచలం అన్నారు. దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో రాష్ట్రంలోని ఆగ్రో ఫారెస్ట్రీ నర్సరీలకు అక్రిడిటేషన్ ప్రొటోకాల్‌పై రెండురోజులు ఇచ్చిన శిక్షణ శనివారం ముగిసింది. నర్సరీలకు అక్రిడిటేషన్ రేటింగ్ ఇవ్వడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎన్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగ్రో ఫారెస్ట్రీ చెట్ల ప్రాధాన్యం, ప్రస్తుత సప్లై డిమాండ్, సరఫరా అంతరాన్ని వివరించారు. అటవీ అకాడమీ డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ నర్సరీ అక్రిడిటేషన్ ప్రాముఖ్యతను, నాణ్యమైన ప్లాంటింగ్ మెటీరియల్ ఉత్పత్తి గురించి వివరించారు. ఐసీఏఆర్-సీఏఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త సురేష్‌రమణన్, స్టేట్ సిల్వికల్చరిస్ట్ శ్రీనివాస్ ప్రసంగించారు. టీఓఎఫ్ఐ బృందం నుంచి బాలచిన్నపారెడ్డి, ప్రతాప్,సతీష్, ప్రణీత్, ప్రవీణ్ కార్యక్రమ నిర్వహణకు హాజరయ్యారు. రాష్ట్రంలో నలు మూలాల నుంచి అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ విభాగాలకు చెందిన 23 మంది అధికారులు శిక్షణలో పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు

త్వరలోనే పరిష్కరిస్తాం

● నీటి పారుదల శాఖమంత్రి రామానాయుడు



మంత్రి రామానాయుడుతో మాట్లాడుతున్న పోలవరం నిర్వాసితులు

దేవీపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని నీటి పారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు నిర్వాసితులకు హామీ ఇచ్చారు. శనివారం దేవీపట్నం గ్రామానికి చెందిన కొంతమంది నిర్వాసితులు పాలకొల్లులోని మంత్రి నివాసానికి వెళ్లి 44నిర్వాసిత గ్రామాలకు సంబంధించి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ముఖ్యం గా గోకవరం గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలో ఉన్న దేవీపట్నం కాలనీ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కోర్టులో ఉన్న తొమ్మిది ఎకరాలు సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిం చి త్వరలోనే కాలనీలను సందర్శిస్తానన్నారు. ఈ కార్యక్రమంలోసిద్ద అన్నపూర్ణ, సిద్ద రామకృష్ణ, లంక హరిశ్చంద్రుడు, గేదెల చినసుబ్బారావు, దొడ్డ సింహాద్రి, సిద్దా వెంకట నారాయణస్వామి, తిరుమలశెట్టి శ్రీనివాస్, కుంచనపల్లి రోజా, రొంగల రామచంద్రరావు, లింగంపల్లి సాయిఅచ్యుతరామయ్య ఉన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

తూర్పుగోదావరి జిల్లా డీఈవో వాసుదేవరావు

బిక్కవోలులో ముగిసిన అంతర జిల్లాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు ప్రథమం, శ్రీకాకుళం ద్వితీయ స్థానాలు కైవసం



ప్రథమ స్థానం సాధించిన గుంటూరు బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఈవో

బిక్కవోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలు ప్రతి విద్యార్థికి అవసరమని తూర్పుగోదావరి జిల్లా విద్యా శాఖాధికారి పి.వాసుదేవరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో నిర్వహిస్తున్న 68వ అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 బాలికల పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో డీఈవో మాట్లాడుతూ క్రీడలకు గతంలో 2శాతం కోటా ఉండేదని దానిని కూటమి ప్రభుత్వం 3శాతానికి పెంచిందని, క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. తల్లిదండ్రులందరూ విద్యార్థుల చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలు సాధించిన గుంటూరు, శ్రీకాకుళం, విశాఖ, ప్రకాశం జట్ల బాలికలకు ఆయన ట్రోఫీలు అందజేశారు. క్రీడలు దిగ్విజయంగా నిర్వహించిన జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ. స్వామిని, పీడీ అసోషియేషన్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల అబ్జర్వర్ సీహెచ్ రజనీదేవి, హెచ్ఎం పి.వీరప్రభాకరరావు, పీడీ, పీఈటీ అసోషియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, గౌరవాధ్యక్షుడు నల్లమిల్లి అప్పారెడ్డి, అనపర్తి జోన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి టీవీ. రాఘవరెడ్డి, పీడీలు వై.బంగార్రాజు, మానుకొండ ధనరాజు, నందిపాటి శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, వీకేఆర్.తంబి, ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవో కె.హర్షచంద్రరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు...

ఫైనల్స్‌లో గుంటూరు-శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. గుంటూరు 35-27, 35-27 స్కోరుతో శ్రీకాకుళంపై విజయం సాధించి ప్రథమ స్థానం సాధించగా, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం పొందింది.. అలాగే విశాఖ.. ప్రకాశం జట్టుపై 35-30, 35-31 స్కోరుతో గెలుపొంది ద్వితీయ స్థానం పొందగా ప్రకాశం జట్టు నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

సాఫ్ట్‌బాల్ విజేత విజయనగరం జిల్లా జట్టు

● ద్వితీయ స్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు ● ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



ట్రోఫీతో సాఫ్ట్‌బాల్ విజేత విజయనగరం జిల్లా బాలికల జట్టు



ద్వితీయ స్థానంలో నిలిచిన తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు

కాకినాడ రూరల్ నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం ముగిసినట్టు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎల్.జార్జ్ తెలిపారు. విజయనగరం జిల్లా జట్టు విజేతగా నిలవగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తృతీయస్థానంలో కడప జిల్లా జట్టు నిలిచింది. ఈ జట్ల నుంచి ఉత్తమ జట్టును ఎంపిక చేస్తారు. అలా ఎంపికైన జట్టు మహారాష్ట్రలో జనవరిలో జరిగే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటుంది. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, పీఈటీ సంఘ అధ్యక్షకార్యదర్శులు రవిరాజు,నూకరాజు చేతులమీదుగా విజేతలకు ట్రోఫీలను, పతకాలను అందజేశారు.

డివైడర్‌ను ఢీకొని ట్రాలీ లారీ బోల్తా

డ్రైవర్ పరారీ.. క్లీనర్‌కు స్వల్ప గాయాలు

రాజానగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రైలు చక్రాల లోడుతో వెళ్తున్న లారీ రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి విశాఖపట్నానికి రైలు చక్రాలతో వెళ్తున్న ట్రాలీ మార్గమధ్యలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో గైట్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొని సర్వీసు రోడ్డులోకి దూసుకొచ్చింది. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే సంఘటనా స్థలంలో ప్రమాద సమయంలో కళాశాల విద్యార్థులు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్ పరారీ కాగా క్లీనర్ కిందికి దూకడంతో స్వల్ప గాయాలయ్యాయి. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ మనోహర్ తెలిపారు.



గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో హైవేపై పడిన రైలు బండి చక్రాలు

కుక్కుటేశునికి రుద్రాభిషేకం

పిఠాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామికి శనివారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. కార్తీకమాసం పూజల్లో భాగంగా పత్రిపూజ జరిగింది. అష్టాదశ శక్తిపీఠాల్లో దశమశక్తి పీఠానికి అధిష్ఠాన దేవతైన పురుహూతికాఅమ్మవారు, రాజరాజేశ్వరీదేవిలకు కుంకుమపూజలు జరిగాయి. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పాదగయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

కనుల పండువగా

కోటివత్తుల దీపోత్సవం

శివనామస్మరణతో మార్మోగిన గొల్లప్రోలు

గొల్లప్రోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణం శనివారం రాత్రి శివనామస్మరణతో మార్మోగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం) వద్ద కోటివత్తుల దీపోత్సవం కనులపండువగా జరిగింది. 108మంది దంపతులు ఒక్కొక్కరు లక్ష వత్తుల కుందెలను వెలిగించారు. కోటివత్తుల దీపోత్సవంతో శివాలయం పరిసరాలు దేదీప్యమానంగా వెలుగులు చిందించాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గొల్లప్రోలు శివాలయం వద్ద నిర్వహించిన కోటివత్తుల దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

అపర్ణాదేవి అలంకారంలో సహస్ర దీపాలంకరణ

గొల్లప్రోలు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా నాగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శనివారం రాత్రి అపర్ణాదేవి అలంకారంలో సహస్ర దీపాలంకరణ చేశారు. వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రధాన అర్చకుడు ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆలయంలో నిర్వహించిన దీపాలంకరణ

రికార్డుస్థాయిలో సత్యదేవుడి వ్రతాలు

కార్తీకమాసం ఒకరోజు మిగిలుండగానే 1,44,785 వ్రతాలు

అన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయంలో ఈ ఏడాది కార్తీక మాస వ్రతాలు రికార్డుస్థాయిలో నమోదయ్యాయి. ఇప్పటివరకు కార్తీకంలో 2022లో జరిగిన 1,42,373 వ్రతాలు రికార్డుకాగా కార్తీకం ముగియడానికి ఒకరోజు ముందైన శనివారానికి 1,44,785 వ్రతాలు జరిగినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. వీటిలో 70శాతం వ్రతాలు రూ.300 ధరలోనివి కావడం విశేషం. ఈ ఏడాది కార్తీకమాసంలో బహుళ ఏకాదశి రోజున మాత్రమే 10,000 వ్రతాలు దాటగా మిగిలిన రోజుల్లోనూ రికార్డు స్థాయిలో వ్రతాలు జరగడం గమనించదగిన విషయం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది, వ్రత పురోహితులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారంతో కార్తీక మాసం ముగియనుండగా మరో 3వేల వ్రతాలు అదనంగా జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.



సత్యదేవుడి ఆలయంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు

శృంగారవల్లభస్వామి దర్శనానికి

పోటెత్తిన భక్తజనం





శృంగారవల్లభస్వామి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

పెద్దాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి దర్శనానికి భక్తులు శనివారం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,04,210, అన్నదాన విరాళాలు రూ. 61,968 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.6,960, తులాభారం, కానుకల ద్వారా రూ.350, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.27,015 వెరసి రూ.3,00,503 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 12 వేలమంది స్వామివారిని దర్శించుకున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు ఉన్నారు.

అయోమయంలో బోట్ల నిర్వాహకులు

అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ అధికారుల కొత్త నిబంధనలు



పోచవరం బోట్ పాయింట్ దగ్గర ఉన్న పర్యాటక బోట్లు

విఆర్‌పురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ అధికారుల కొత్త నిబంధనలతో పాపికొండలు, పేరంటాలపల్లి విహార యాత్రకు వెళ్లే బోట్ల నిర్వాహకులు అయోమయంలో పడ్డారు. ఎన్నడూ లేని విధంగా 50 మంది పర్యాటకులు బోట్‌పై విహార యాత్రకు వెళ్లాలంటే బోట్ నిర్వాహకులు రూ.2500, 100 మంది పర్యాటకులతో విహార యాత్రకు బోట్ వెళ్తే రూ.4000 కట్టాలని అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ అధికారులు నోటీసులు జారీచేశారు. దీంతో బోట్ల నిర్వాహకులు మా పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బోట్ నిర్వాహకులు మాదిరెడ్డి సత్యనారాయణ, సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ పాపికొండలకు వచ్చే ప్రతి వాహనం దగ్గర ఫారెస్టు అధికారులు అభయ అరణ్యం పేరుతో రూ.50 నుంచి 100 వసూలు చేస్తున్నారని, ఇప్పుడు మాపై ఇంత భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం పర్యాటకం అంతంత మాత్రంగానే ఉందని, ఈ విషయంపై ఉన్నతస్థాయి అధికారులు స్పందించి అటవీశాఖ అధికారులు కొత్తగా పెట్టిన నిబంధనలను ఉపసంహరించుకోవాలని భద్రాద్రిబోట్ యూనియన్ తరుఫున కోరారు. ఈ విషయమై విఆర్‌పురం ఇన్‌చార్జి రేంజర్ అధికారి మూర్తిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అటవీశాఖ ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలతోనే పోచవరం బోట్ పాయింట్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

జీఎస్ఎల్‌లో ఎఫ్ఏజీఐఈ ఈఆర్‌సీపీ కాన్ఫరెన్స్

రాజానగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎఫ్ఏజీఐఈ ఈఆర్‌సీపీ (ఫెలోషిప్ ఇన్ అడ్వాన్స్‌డ్ జీఐ ఎండోస్కోపి- ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ కొలాంజియో పాంక్రియోటోగ్రఫీ) కాన్ఫరెన్స్‌ను తూర్పుగోదావరి జిల్లా జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ ఐఏజీఈఎస్(ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటస్టెయినబుల్ ఎండో సర్జన్స్) కాన్ఫరెన్సులో 130 మంది మెడికల్ పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులు లాప్రోస్కోపిక్ సర్జరీల్లో శిక్షణ పొందుతున్నారన్నారు. అలాగే మరో 63మంది విద్యార్థులు, డాక్టర్లు ఎగువ ఉదరకోశం (అప్పర్ అబ్డామిన్), లివర్, గాల్ బ్లాడర్, పాంక్రియాస్ మొదలైన వాటికి ఎండో స్కోప్‌తో జరిపే పరీక్షలు, చికిత్సలకు సంబంధించి (ఫెలోషిప్ ఇన్ అడ్వాన్స్‌డ్ జీఐ ఎండోస్కోపి- ఎండోస్కోపిక్ రిట్రోగ్రేడ్ కొలాంజియో పాంక్రియోటోపోగ్రఫి)శిక్షణ పొందుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కాన్ఫరెన్స్ సెక్రటరీ డాక్టర్ సమీర్ రంజన్ నాయక్(ఏపీ), సీనియర్ సర్జన్లు డాక్టర్ ఈశ్వరమూర్తి(తమిళనాడు), భవనీత్ సింగ్ భల్లా(పంజాబ్), సతీష్‌కుమార్ మిధా(జార్ఖండ్), సునీల్‌పోపట్(గుజరాత్); సిద్దేశ్(కర్ణాటక), గోవిందరాజ్(తమిళనాడు), అరుణ్ కరియంపూడి(ఏపీ), గౌతమ్‌కుమార్(ఏపీ), వీవీఎంఎస్ శ్రీరామ్(ఏపీ) సర్జరీలు చేసి జూనియర్ డాక్టర్లకు నైపుణ్యాలు పెంపొందించారు.



అతిథులకు జ్ఞాపికలు అందజేస్తున్న చైర్మన్

బంగారం తాకట్టు వ్యాపారిపై దాడి

రాడ్‌తో కొట్టి పరారైన ఇద్దరు

రౌతులపూడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడిలో బంగారు తాకట్టు వ్యాపారి రేతు జనారిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేయగా తలకు గాయమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వ్యాపారి జనారి ఇంటి వద్ద నుంచి షాపునకు శనివారం ఉదయం 9గంటలు సమయంలో రాగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి షాపులోకి వెళ్లి జనారిపై రాడ్‌తో దాడి చేశారు. జనారి గాయాలతో బయటకు రాగా చుట్టుపక్కలవారు వెళ్లేసరికి బైక్‌పై ఆ ఇద్దరు పరారయ్యారు. అయితే శుక్రవారం కూడా ఉదయం ఆ ఇద్దరు బంగారం వస్తువు తాకట్టు పెట్టాము వడ్డీ ఎంత అయ్యిందో చూడాలని రాగా వ్యాపారి వస్తువు తాకట్టు పెట్టినప్పుడు ఇచ్చిన కార్డు తీసుకురావాలని చెప్పడంతో తరువాత రోజు రావాలని చెప్పాడు. దీంతో శనివారం ఆ ఇద్దరు మళ్లీ వచ్చారు. 10 నిమిషాలపాటు మాట్లాడారు. రాడ్‌తో బెదిరించగా నా దగ్గర ఏముంటే అది పట్టుకుపోండంటూ వ్యాపారి చెప్పినప్పటికీ రాడ్‌తో తలపై కొట్టడంతో వ్యాపారి బయటకు వచ్చి కేకలు వేయడంతో బైక్‌పై ఇద్దరు పారిపోయారు. వ్యాపారికి తలకు బలమైన గాయం కావడంతో రౌతులపూడి ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం బంధువులు కాకినాడ తరలించారు. కేసు నమోదు చేసి సీసీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.



గాయపడిన వ్యాపారి

భీమేశ్వరాలయంలో నాగబాబు సతీమణి ప్రత్యేక పూజలు

సామర్లకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, జనసేన పార్టీ నాయకుడు నాగబాబు సతీమణి పద్మజ బంధువులతో కలిసి శనివారం రాత్రి సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపారాధన పూజలు చేశారు. ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదరంగా స్వాగతం పలికారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు అందజేశారు.



భీమేశ్వరుడిని దర్శించుకుంటున్న పద్మజ

మోటారుసైకిల్‌ను ఢీకొన్న టిప్పర్ లారీ

మహిళ మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

గండేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో మహిళ మృతిచెందిన సంఘటన శనివారం కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్ళూరులో జరిగింది. గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన కర్ణం నాగరత్నం(58) యల్లమిల్లి నుంచి తాళ్ళూరు గుడికి వచ్చి దర్శనం అనంతరం మోటారుసైకిల్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా తాళ్ళూరు గ్రామ శివారున ఎదురుగా అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొంది. దీంతో మోటార్‌సైకిల్ నడిపే వ్యక్తి, ఆ వెనుక కూర్చున్న నాగరత్నం కిందపడిపోగా ఆమె తలపై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోవడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. దీనిపై ఆమె కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ యువి శివనాగబాబు సంఘటన ప్రదేశాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోర్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాళ్లరేవు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ ఫైడా కాలేజీ సెంటర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. మారేడుమల్లి వెలమకోటకు చెందిన తుంబుడు సుబ్బారెడ్డి(24) కాకినాడలోని ఒక హోటల్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితులు పుట్టినరోజును యానాంలో చేసుకుని యానాం నుంచి తన ద్విచక్రవాహనంపై కాకినాడ వెళ్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ఫైడాకాలేజీ సెంటర్ వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో సుబ్బారెడ్డి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

గొల్లప్రోలు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు కోటలంకవారి చెరువులో పడి వ్యక్తి మరణించాడు. గ్రామానికి చెందిన ఉలవల వీరబాబు(47) శనివారం తెల్లవారుజామున చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. స్థానికులు గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. కాగా ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గొల్లప్రోలు పోలీసులు తెలిపారు.

నడకుదురులో డెంగ్యూ కేసు నమోదు

కరప, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలంలోని నడకుదురు గ్రామంలో డెంగ్యూ కేసు నమోదుకావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్సీపేటకు చెందిన మాసా అర్జునరావు గ్రామ పంచాయతీలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 27న అతను తీవ్ర జ్వరం, తలపోటుతో బాధపడుతూ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. టెస్ట్ చేయగా డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కరప మండల వైద్యాధికారి డాక్టర్ రమావత్ శ్రీనివాసనాయక్ వైద్యసిబ్బందితో కలిసి ఎస్సీపేటలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను తెలుసుకుని వైద్యపరీక్షలు చేశారు. సర్పంచ్ దేగల లలితకుమారి, పంచాయతీ కార్యదర్శి కె.వారిజలు బాధితుడి ఇంట్లో పైరిత్రమ్ మందును పిచికారీ చేయించారు.



నడకుదురులో కెమికల్ స్ప్రేయింగ్ చేయిస్తున్న అధికారులు

అనంతకుమారి పూజలు

అంతర్వేది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆమెకు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

నేడు రెడ్డిపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

అమలాపురంటౌన్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సేవాసమితులు, డాక్టర్ కేవీఆర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్డిపల్లి సచివాలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ కరాటం రత్నప్రసన్న-ప్రవీణ్ తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొంటారన్నారు.

ఫెంగల్ తుఫాన్‌తో సార్వా రైతుల ఆందోళన

నేలనంటుతున్న వరి చేలు
కళ్లాల్లో ధాన్యానికి బరకాలతో రక్షణ




మామిడికుదురులో నేలనంటిన వరిచేను, ఉప్పలగుప్తం:కూనవరంలో నేలకొరిగిన సార్వాపైరు

మామిడికుదురు,నవంబరు30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు విలవిల్లాడుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో శనివారం ఉదయం నుంచి తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంటకు అపార నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాల ప్రభావంతో పలుచోట్ల వరి చేలు నేలనంటాయని, తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. మండల పరిధిలో 2420 విస్తీర్ణంలో సార్వా సాగు చేశారని, దీనిలో 300ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తయ్యాయి. మిగిలిన పంట కోత కోయాల్సి ఉండగా కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు పాడయ్యే ఆస్కారం ఉందని రైతులు కలవరపడుతున్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే నష్టాలు తప్పవని రైతులు పేర్కొంటున్నారు.

అకాల వర్షాలతో రైతుల్లో కలవరం

ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలు, గాలులతో ఖరీఫ్ రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఐదు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ శుక్రవారం నుంచి మాత్రమే వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి మాసూళ్ల పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కోతలకు వచ్చిన యంత్రాలను వరి చేలల్లో నుంచి మెరక ప్రాంతాలకు తరలించారు. ఎండిన ధాన్యాన్ని విక్రయించుకోగా మిషను కోసిన ధాన్యం ఇంకా అరకపోవడంతో రాశులుగా చేలల్లోను, కళ్లాల్లోను ఎక్కడికక్కడే బరకాలు కప్పి కాపాడు ప్రయత్నాలు రైతులు చేపట్టారు. జిల్లాలో 1,57,812 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు కాగా ఇప్పటివరకు 98,004ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు 1.10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు విక్రయించుకోగా ఇంకా 1.36లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లో రాశులుగా ఉంది. ఇంకా 59,808 ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉంది. వర్షాలు, గాలులకు ఆ వరి నేలకొరుగుతుంది. దీంతో చేలల్లో ఉన్న వరికి నష్టం జరిగే ప్రమాదం ఉందని రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

రైతులను వణికిస్తున్న తుఫాను

పి.గన్నవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా కురుస్తున్నవర్షాలు, గాలులతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. రెండు రోజులుగా ఓ మాదిరిగా వర్షం కురిసినప్పటికీ శనివారం భారీ వర్షం కురవడంతో వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కోతలు నిలిపివేసినప్పటికి ధాన్యం రాశులు ఉండటంతో రైతులు వాటిని రక్షించుకునే పనిలో పడ్డారు. రైసుమిల్లుల వద్ద వర్షం కారణంగా దిగుమతులు సరిగా జరగడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో బస్తాలు సైతం కళ్లాల్లో ఉండటంతో వాటికి కూడా బరకాలతో రక్షణ కల్పిస్తున్నారు. తేమ ఎక్కువగా ఉన్న ధాన్యం రాశులకు కళ్లాల్లోనే సురక్షిత ప్రాంతంలో బరకాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి: ఏడీఏ

తుఫాన్ కారణంగా డిసెంబరు 4 వరకు కోతలు వాయిదా వేసుకోవాలని ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు రైతులను కోరారు. సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 11,657 ఎకరాలకు 3,124 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయన్నారు. 6004 మెట్రిక్ టన్నులు ధాన్యం రైస్‌మిల్లులకు తరలిపోయినట్లు చెప్పారు. ఎంపీడీవో కేవీ ప్రసాద్ ధాన్యం రాశులను పరిశీలించి, కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశారు.

జనజీవనం అస్తవ్యస్తం

కాట్రేనికోన, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో మండలంలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. దుకాణాలు మూతపడ్డాయి. ప్రస్తుతం వరికోతలు ముమ్మరంగా సాగుతుండగా అనుకోకుండా వచ్చిన తుఫాను రైతులను దెబ్బతీసింది. సగం విస్తీర్ణంలో వరి పనల దశలో చేలల్లో ఉంది. నాల్గవ వంతు పంట కళ్లాల్లో ఉంది. మిగిలిన విస్తీర్ణంలో పంట చేలల్లో ఉండి గాలికి నేలకొరగడంతో కోతకు సాధ్యమయ్యేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేలల్లో ఉన్న పనలు తడిసిపోయి మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. కళ్లాల్లో ధాన్యం మిల్లులకు తరలించే అవకాశం లేకపోవడంతో రైతులు దిగాలు పడ్డారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేలల్లో ఉండిపోవడంతో అన్నదాతలు విషాదానికి గురవుతున్నారు. తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రహదారులు జలమయం

అంబాజీపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఉదయం నుంచి వర్షం రావడంతో జనసంచారం స్తంభించింది. రైతులు వరి కోతలు చేపట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. ధాన్యం రాశులను బరకాలతో కప్పి భద్రపరిచారు. వరి కోతలు వాయిదా వేసుకున్నారు. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి, గాలులకు వరిదుబ్బులు నేలన్నంటాయి. ధాన్యంలో తేమ శాతం ఉన్నప్పటికి ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించుకోవాలని తహశీల్దారు జె.వెంకటేశ్వరి సూచించారు. కె.పెదపూడిలో ఉన్న ధాన్యాన్ని ముక్కామల రైస్‌మిల్లుకు తరలించారు. మండలంలో 3009 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టగా 700 ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్టు ఏవో సీహెచ్‌డీ విజయకుమార్ తెలిపారు.

నేలనంటుతున్న సార్వా పైరు

ఉప్పలగుప్తం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో శనివారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో రైతులు ఆందోళనలో పడ్డారు. అధికారుల సూచనలతో రైతులు చాలా వరకు జాగ్రత్త పడ్డారు. సుమారు 4000 ఎకరాల సార్వా పైరుకు గాను నాలుగో వంతు కోతలు జరిగాయి. అయితే మిగిలిన పైరు చేలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. వర్షంతో పలు గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పైరు నేలకొరిగింది. గాలులు, వర్షం మరింత పెరిగితే పైరు నేలనంటి కోతకు సాధ్యం కాకుండా పోతుందని రైతులు భయపడుతున్నారు. నేలకొరిగిన పైరును కోయాలంటే ఎక్కువ ఖర్చవుతుంది.

పనులపై ముందుగా సమాచారం ఇవ్వడం లేదు

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ బొంతు ఆవేదన



నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వార్డుల్లో చేపట్టే పనుల వివరాలు ముందుగా ఆ వార్డు కౌన్సిలర్లకు తెలియచేయడం లేదు. అధికారులు వార్డులకు వచ్చి రోడ్ల పనులకు సంబంధించి కొలతలు తీసుకువెళుతున్నారు. అయితే అక్కడ ఆ పనులు చేయకుండా మరోచోట రోడ్లు వేస్తున్నారు. కౌన్సిలర్లను కేవలం సమావేశాల్లో తీర్మానాలకే పరిమితం చేస్తున్నారు. ఇలా అయితే ప్రజల్లో తమకు ఏం విలువ ఉంటుందని 17వ వార్డు వైసీపీ కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. దీనిపై టీడీపీ కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అభివృద్ధిని కోరుకుంటున్నారని, ఎక్కడా వివక్షత చూపడంలేదని, గతంలో అయితే అధికార పార్టీకే ప్రాధాన్యం ఇచ్చేవారని ఇప్పుడు అది లేదని పేర్కొన్నారు. దీనిపై వైసీపీ కౌన్సిలర్లు గంజా శ్రీనివాస్, సరిపెల్ల రామకృష్ణంరాజులు అడ్డుతగిలారు. చైర్మన్ ప్రవీణ్‌కుమార్ జోక్యం చేసుకుని పార్టీల రహితంగా కౌన్సిలర్లందరికీ గతంలోను, ఇప్పుడు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండు స్థలాన్ని ఆక్షన్ పెట్టి లీజుకు ఇవ్వడం వల్ల ముమ్మిడివరానికి బస్టాండు లేకుండా పోయిందని, మరో చోటైనా బస్టాండు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ ప్రవీణ్‌కుమార్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, శానిటేషన్ నిర్వహణకు సిబ్బంది కొరత ఉన్నా, ఉన్న సిబ్బందితో శానిటేషన్ సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి పైపులైను లీకేజీలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్ అధికారులకు సూచించారు. ఉన్న నిధులతో ప్రాధాన్యతా క్రమంలో నగర పంచాయతీలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి అవసరమయ్యే నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని ఇప్పటికే దాట్ల బుచ్చిబాబు కూడా హామీ ఇచ్చారన్నారు. బిల్లుల చెల్లింపు వేగవంతం చేయాలని, గతంలో పనిచేసిన ఏఈ మంచినీటి సరఫరా చేసిన ట్యాంకరు యజమానికి బిల్లులు చెల్లింపు చేయకపోవడంతో ఆ ట్యాంకరు యజమాని ఇబ్బంది పడ్డారన్నారు. 9వ వార్డులో గడపగడపకు వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు, వంతెన మంజూరు చేసినా ఇప్పటి వరకు ఆ పనులు చేయకపోవడంతో అక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కుక్కల నిర్మూలనకు సమగ్రమైన చర్యలు చేపట్టాలని అడబాల సతీష్ విజ్ఞప్తి చేశారు. కమిషనర్ పి.రవివర్మ మాట్లాడుతూ గతంలో తాను ఇక్కడ మూడేళ్లు పనిచేసిన అనుభవం ఉందని, నగర పంచాయతీ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. సమావేశంలో 1వ సాధారణ నిధుల నుంచి ప్రారంభ నిల్వ, వివిధ పద్దుల కింద జమకలిపి రూ.49,81,116గాను వివిధ ఖర్చులకు సంబంధించి రూ.35,22,097, ముగింపు నిల్వ రూ.14,59,589, రెండో సాధారణ నిధుల నుంచి ప్రారంభ నిల్వతో కలిపి వివిధ పద్దుల జమలతో రూ.19,95,622గాను వివిధ ఖర్చులకు సంబంధించి రూ.10, 99,159, ముగింపు నిల్వ రూ.8,96,463గా చూపిన తీర్మానాలను సమావేశం ఆమోదించింది. సమావేశంలో వైస్‌చైర్మన్లు వేటుకూరి బోసురాజు, రెడ్డి హేమసుందరి, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అప్పనపల్లి బాలబాలాజీకి విశేష పూజలు



బాలబాలాజీస్వామికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, భక్తులు

మామిడికుదురు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి శనివారం పురస్కరించుకుని అప్పనపల్లి బాలబాలాజీస్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని అర్చకులు వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అంకరించారు. వేకువజామున వేదమంత్రోచ్చారణల నడుమ సుప్రభాత సేవ, తొలిహారతి ఇచ్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.3,60,891 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయకమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. నిత్యాన్నదాన పథకానికి తాటిపాక గ్రామానికి చెందిన మట్టపర్తి వెంకటనారాయణ రూ.10,116ను విరాళం అందించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శివాలయాల్లో లక్ష బిల్వార్చనలు

అల్లవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కొమరగిరిపట్నం కాశీవిశ్వేశ్వరస్వామి, అల్లవరం ఉమామల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చనలు, కుంకుమార్చనలు ఘనంగా జరిగాయి. అల్లవరంలో మూల లక్ష్మీనరసింహం వంశీయుల ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం బ్రహ్మణ కుటుంబాల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన పూజలు జరిగాయి.

పోటెత్తిన భక్తులు

ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి శనివారం కావడంతో ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో పల్లిపాలెంలోని శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయాన్నే నదీస్నానాలు ఆచరించి ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొండవీటి రాంబాబు, ఆదిత్య శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటుచేశారు. ఆలయం వద్ద నిర్వాహకులు పెన్మెత్స చిట్టిరాజు, పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అన్నసమారాధన నిర్వహించారు. పంచాయతీరాజ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.రామకృష్ణారెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు, ముమ్మిడివరం డీఈఈ పీవీ శ్రీనివాసరావులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆంజనేయస్వామికి పూజ

మామిడికుదురు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామికి హనుమాన్ చాలీసా పారాయణ సహిత తమలపాకుల పూజ శనివారం వైభవంగా నిర్వహించారు. సుదర్శనం వెంకటజనార్ధనాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు సుదర్శనం వెంకటసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. సీతారామ కల్యాణం, సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ భక్తులను ఆకట్టుకున్నాయి. అక్కిరాజు శ్రీనివాస బృందం ఆలపించిన హనుమాన్ చాలీసా పారాయణ భక్తుల మనసులను రంజింప చేసింది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

శివకేశవులుగా దర్శనం

అమలాపురం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో శనివారం శివకేశవులుగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భువనేశ్వరి అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. కేశవ నామాకృతితో ఉన్న శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి-చంద్రకళ దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

లక్ష బిల్వార్చన

మలికిపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గుడిమెళ్లంక ఉమాలక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో మంగళంపల్లి సాయి బ్రహ్మత్వంలో శనివారం రుత్వికుల ఆధ్వర్యంలో గణపతిపూజ, లక్ష బిల్వార్చన పూజ, కుంకుమార్చన జరిగింది. కార్యక్రమంలో గ్రామంలోని పలువురు దంపతులు, భక్తులు పాల్గొన్నారు. మంగళంపల్లి సుబ్రహ్మణ్యశర్మ, దంతులూరి సురేష్, కట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను అప్రమత్తం చేయాలి



తుఫాన్‌పై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

అంతర్వేది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావం ఉన్న ప్రాంతాలను అప్రమత్తం చేయాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి అన్నారు. సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల అధికారులతో తుఫాన్ ప్రభావంపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, వెటర్నరీ, వైద్య, విద్య అధికారులతో మాట్లాడారు. అంతర్వేదిపల్లిపాలెం, దేవస్థానం, అంతర్వేది, కేశవదాసుపాలెం, గొంది గ్రామాల్లో ఉన్న తుఫాను షెల్టర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించాలన్నారు. తుఫాన్ అనంతరం ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, మత్స్యకార గ్రామాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలన్నారు.తహశీల్దార్ (ఎఫ్‌ఏసీ) సీహెచ్ భాస్కర్, ఎంపీడీవో (ఎఫ్‌ఏసీ) కె.సూర్యనారాయణ, ఆర్‌ఐ రామరాజు, ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్, ఏవో పీవీ నరసింహారావు, వైద్యాధికారి డాక్టర్ యూనస్, ఎంఈవో డి.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

రాము మృతి కార్మిక లోకానికి తీరని లోటు

అమలాపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్మిక ఉద్యమనేత గళ్లా రాము మృతి కార్మిక లోకానికి తీరని లోటని దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవాసంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి చెప్పారు. సంఘ కార్యాలయంలో శనివారం రాము చిత్రపటానికి సేవా సంఘ నాయకులు నివాళులర్పించారు. సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, నల్లా నరసింహమూర్తి, పితాని బేబీరావు, కొనుకు వెంకటేశ్వరరావు, కుసుమే నరసింహరాజు,కొప్పిశెట్టి ఉమామహేశ్వరరావు, సాధనాల రామకృష్ణ, గిడ్ల రాంబాబు పాల్గొన్నారు. గళ్లా రాము కుటుంబ సభ్యులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. రాముచిత్రపటానికి నివాళులర్పించారు.

సూర్యనారాయణరాజుకు ఘన నివాళి

పి.గన్నవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ తండ్రి సూర్యనారా యణరాజు ఇటీవల మృతి చెందారు. భీమవరంలో మంత్రిని శనివారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. సూర్యనారాయణరాజు చిత్రపటానికి నివాళులర్పించారు.

కృష్ణ చైతన్య యాదవ సంఘం వనసమారాధన

యానాం, నవంబరు30(ఆంధ్రజ్యోతి):స్థానికఫెర్రీరోడ్డులో కృష్ణ చైతన్య యాదవసంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమరాధన నిర్వహించారు. జిల్లాకు చెందిన యాదవసంఘ అధ్యక్షుడు కుండల సాయికుమార్, నాయకులు అల్లురాజు, మందాల గంగ సూర్యనారణ, గొంటి కుమార్ చౌదరియాదవ్ హాజరయ్యారు. యానాం సంఘ ప్రతినిధులు జిల్లాకు చెందిన నాయకులను సత్కరించారు. మట్ట సురేష్, పెనుగొండ దుర్గబాబు,బీరామేను నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరమాత్ముడు ధర్మపక్షపాతి

అమలాపురం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్ని అవాంతరాలు ఎదురైనా పరమాత్ముడు ధర్మం పక్షానే నిలుస్తారని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చందన గౌరీశంకరనారాయణ తెలిపారు. కురుక్షేత్రంలో పాండవుల పక్షానే పరమాత్మ నిలిచారని వివరించారు. స్వధర్మం విశిష్టతను ప్రపంచానికి చాటిన మహనీయుడు కృష్ణ పరమాత్మేనన్నారు. బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని 30 రోజులుగా ఆయన భగవద్గీత జ్ఞాన మహాయజ్ఞంలో భాగంగా ప్రతీరోజు రాత్రి ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. శనివారం రాత్రి భగవద్గీతలోని జ్ఞానకాండకు సంబంధించిన అనేక అంశాలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, బళ్ల స్వామివివేకానంద, మాచరమ్మ, చింతా అత్తిలింగం, ఉప్పుగంటి భాస్కరరావు, కొండా చంటి, గోళ్ల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

8న క్రీడా జ్ఞాన పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలి

అమలాపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చైతన్య కశ్యప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా భారతి పురస్కారాలు-2024 అందించే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబరు 8న క్రీడా జ్ఞానపరీక్ష నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు, విద్యార్థులు, పౌరులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా ఇద్దరికి రూ.50వేలు, మూడో బహుమతిగా రూ.25వేలు చొప్పున ఆరుగురికి, నాలుగో బహుమతిగా 11మందికి రూ.11వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తారు. 8వ తేదీ ఉదయం 5నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షా సమయం 25 నిమిషాలు ఉంటుందని, 12ఏళ్ల పైబడిన వారంతా అర్హులేనన్నారు. కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్, మొబైల్‌లో పరీక్ష రాసుకునే అవకాశం కల్పించారని సురేష్‌కుమార్ తెలిపారు.

రహదారి సౌకర్యం కల్పించాలని నిరసన

అమలాపురంటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అమలాపురం 17వ వార్డులో రహదారి కల్పించాలని స్థానికులు శనివారం ఆందోళనకు దిగారు. రహదారి సౌకర్యం కల్పించాలని పలు పర్యాయాలు మున్సిపల్ అధికారులను వేడుకుని అర్జీలు అందించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. నిరసనలో రాయవరపు వసుధ, భువనగిరి రాము, సుగ్గు గోపి, పి.సుబ్బారెడ్డి, ఆకి రామకృష్ణ, బీఎస్ఎన్ రెడ్డి, రాళ్లపల్లి సావిత్రమ్మపాల్గొన్నారు.

జిల్లాలో నేడు ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్ష

అమలాపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం మూడు కేంద్రాల్లో జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) ఉచిత నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్టు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్, జిల్లా భౌతిక, గణితశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30నుంచి 12.30 గంటల వరకు నమూనా పరీక్ష జరుగుతుంది. అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీవీ సూర్యనారాయణమూర్తి సమన్వయకర్తగా, కొత్తపేట డివిజన్‌లో రావులపాలెం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారపుపేట వెంకటేశ్వరరావు సమన్వయకర్తగా, రామచంద్రపురం డివిజన్‌లో ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవీఎస్ సుబ్రహ్మణ్యం, శనివారపు పాపయ్యలు సమన్వయకర్తలుగా నమూనా పరీక్ష జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోదాములు పరిశీలించిన కలెక్టర్



ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల భద్రతకు సంబంధించి తగిన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల గోదాములో భద్రపరిచిన విషయం విదితమే. నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల సీల్డులను తనిఖీచేసి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈవీఎంలకు భద్రతకు సబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్డీవో మధన్మోహనరావు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, పోలీసు అధికారులు ఉన్నారు.

దింపు కార్మికుడికి న్యాయం చేయాలి

అంబాజీపేట, నవంబరు30(ఆంధ్రజ్యోతి): దింపు కార్మికుడు బొక్కా వెంకట నగేష్‌బాబును ప్రభుత్వం, యాజమాన్యం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పరిశోధన కేంద్రంలో నాలుగు రోజుల క్రితంహైబ్రిడ్ కొత్త వంగడం తయారీలో భాగంగా 30అడుగుల చెట్టు ఎక్కి పనిచేస్తుండగా నగేష్‌బాబు చెట్టు నుంచి జారి కిందపడిపోయాడు. దీంతో అతనికి నడుము విరిగి ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నాడు. నగేష్‌ను ఆదుకోకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం, మండల అధ్యక్షురాలు బీర ఎస్తేరురాణి, బి.సోమశేఖర్, వాసంశెట్టి లక్ష్మి, నీతిపూడి ఏడుకొండలు, సబ్బితి శ్రీను, మాతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతున్న యువకుడు శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఈనెల 19న గొల్లలమామిడాడ పెదపూడికి చెందిన ఉల్లం అరుణ్‌కుమార్, ఆకుల సురేష్‌లు మోటారుసైకిల్‌పై వెళ్తూ ముమ్మిడివరం మండలం పదో మైలురాయి సమీపంలో మోటారుసైకిల్ అదుపు తప్పి పడిపోయ్యారు. ఆరోజు యు.అరుణ్‌కుమార్ మృతిచెందాడు. అయితే కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆకుల సురేష్ శుక్రవారం మృతిచెందాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



కాట్రేనికోన, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు నల్లా వెంకటేశ్వరరావు తండ్రి అర్జునరావు ఇటీవల మృతి చెందారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శనివారం వెంకటేశ్వరరావును, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అర్జునరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, దాట్ల పవన్, మోకా అప్పాజీ, జంగా శ్రీనివాసరావు, మోర్త శ్రీనివాస్‌వర్మ, సుంకర బుజ్జి, గుత్తుల సూరిబాబు, బొక్కా చిన్న, ఉరం కృష్ణ, కాశి సాగర్, కోలా గణేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాణేలంకకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ జగతా జానకిరామయ్య సతీమణి వీర వెంకటసత్యనారాయణమ్మ మృతిచెందిన విషయం విదితమే. సతీ వియోగంతో బాధపడుతున్న జానకీరామయ్యను శనివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, మాలకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెల్లి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, యాళ్ల ఉదయ్, వాసంశెట్టి అమ్మాజీ తదితరులు పరామర్శించారు. సత్యనారాయణమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

రాజోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజోలు సీహెచ్‌సీ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వైద్యులకు సూచించారు. శనివారం రాజోలు సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే దేవ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై చర్చించారు. డయాలసిస్ సెంటర్‌లో అదనంగా మరొక ఐదు యూనిట్లు ఏర్పాటుకు కూడా సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

అంతర్వేది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి శనివారం మంచానికి పరిమితమైన వ్యక్తికి రూ.15వేలు పెన్షన్ అందించారు. అర్హులైన పెన్షన్‌దారులు రెండు నెలల పింఛన్ తీసుకోకపోయినా మూడు నెలల పెన్షన్ ఒకేసారి తీసుకోవచ్చునని తెలిపారు. మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందించింది. మండలంలో 9,185 పింఛన్లు ఉండగా శనివారం సాయంత్రానికి 8,720మందికి రూ.3.72కోట్లు అందించి 95శాతం పూర్తి చేసినట్టు ఎంపీడీవో జీవీ సరోవర్ తెలిపారు. మిగిలిన వారికి సోమవారం అందిస్తామన్నారు. గ్రామంలో లేని వారు వచ్చే నెల సొమ్ముతో తీసుకోవచ్చని ఆయన సూచించారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో భాగంగా శనివారం తెల్లవారుజామునే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో నవంబరు 30న పింఛన్లు పంపిణీ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని చింతలమెరకలో మహిళా పోలీసు లక్ష్మీబాయి శనివారం తెల్లవారుజామునే వర్షంలో లబ్ధిదారునికి ఇంటికి వెళ్లి పింఛన్ అందించారు. కొన్నిచోట్ల సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో పింఛన్ల అందజేతలో కొంత జాప్యం చోటుచేసుకుంది.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): గుడిమెళ్లంకలో శనివారం జరిగిన పింఛన్ల పంపిణీని అమలాపురం ఆర్డీవో కె.మాధవి పరిశీలించారు. గ్రామాల్లో పంపిణీ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఆర్డీవో మాధవి వెంట ఎంపీడీవో ఎస్.బాలాజీ, తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.10,116 విరాళం

అయినవిల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి):శ్రీవిఘ్నేశ్వరస్వామి అన్నప్రసాద ట్రస్టుకు రాజమహేంద్రవరం దివాన్‌చెరువుకు చెందిన కె.తిరుమల కృష్ణారావు కుటుంబం రూ.10,116విరాళం అందజేశారు.

ఆలయంలో హైకోర్టు జస్టిస్ పూజలు

అంతర్వేది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి హైకోర్టు జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శనివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ అందించారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకాలు

అమలాపురంటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పారా లీగల్ వలంటీర్స్ పథకం అమలు చేయనున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలంపాటు పనిచేసేందుకు మెట్రిక్యులేషన్ తత్సమానమైన అర్హత కలిగి 18ఏళ్లు నిండినవారు దరఖాస్తులను డిసెంబరు 21వ తేదీలోగా అందజేయాలన్నారు.

తాతపూడి వంతెన మార్గాన్ని నిర్మించరూ..

కపిలేశ్వరపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామంలో ప్రధాన పంట కాలువపై గత టీడీపీ హయాంలో నిర్మించిన వంతెన మార్గం అస్తవ్యస్తంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2017 అక్టోబరు 30న గోదావరి తూర్పు డెల్టా బ్యాంక్ కెనాల్‌పై తాతపూడి వద్ద నిర్మించిన వంతెనను అప్పటి హోంమంత్రి, ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. అప్పటి నుంచి కాలువగట్టు నుంచి వంతెన పైకి వెళ్లే మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణం జరగలేదు. దీంతో రాళ్లు పైకి లేచిపోవడంతో ప్రయాణికులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పైకి వెళ్లే మార్గం వద్ద దిగబడిపోవడంతో కాలువలోకి దూసుకెళ్లే ప్రమాదం ఉందని వాహనదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వంతెనకు ఇరువైపులా బీటీ రోడ్డు నిర్మాణంతోపాటు వంతెనకు పటిష్ఠ చర్యలు, అప్రోచ్ నిర్మాణం చేపట్టాలని, గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.


తుప్పలతో కమ్మేసిన వంతెన మార్గం



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శనేశ్వర ఆలయంలో భక్తుల సందడి

కొత్తపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,22,864 ఒకరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అన్ని చర్యలు తీసుకున్నారు.

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఆలమూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి శనివారం కావడంతో వెంకటేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని జొన్నాడ, చింతలూరు, చొప్పెల్ల, నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు గ్రామాల్లోనున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కార్తీకమాసం శనివారం కావడంతో ఆలయాల వద్ద పలువురు భక్తులు కార్తీక దీపారాధన చేశారు.


ప్రత్యేక అలంకరణలో ఆలమూరు మండలం జొన్నాడ వెంకటేశ్వర స్వామివారు

భక్తి శ్రద్ధలతో అగస్త్యేశ్వరస్వామికి అన్నాభిషేకం

రామచంద్రపురం(ద్రాక్షారామ) నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోనున్న అగస్త్యేశ్వరస్వామికి శనివారం అన్నాభిషేకం జరిపారు. స్థానిక ఆలయంలో వ్యాపారవేత్త కోట వెంకరమణ, వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో చెరుకుపల్లి గణేష్ శర్మ బ్రహ్మత్వంలో చీమలకొండ వినోద్‌శర్మ, మద్దిరాల శ్రీనివాస దత్తు, ఆలయ అర్చకుడు కొత్తలంక ఎర్రయ్యశాస్త్రి స్వామివారికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదంగా దాన్ని అందించారు.


అగస్త్యేశ్వరస్వామికి అన్నాభిషేకం చేస్తున్న రుత్వికులు

ఎమ్మెల్యే వేగుళ్లకు పలువురు అభినందన


ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న ఎస్సీ పెద్దలు

మండపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావును శనివారం పట్టణ ఎస్సీ ఆధ్వర్యంలో పలువురు సత్కరించారు. ఆయనకు అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సరాకుల అబ్బులు, కపిలేశ్వరపురం సర్పంచ్ శాకా శ్రీను, వాకతిప్ప ఎంపీటీసీ కుంచే ప్రసన్నకుమార్, ఈలేటి పెద్ద, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు జక్కల నరేంద్ర కుమార్, చెల్లూరు మాజీ సర్పంచ్ మోరంపూడి రాజ్ కుమార్, పెయ్యల యాకోబు, గండి చంద్రశేఖర్, దాయం శేఖర్, దాసి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ


గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆలమూరు సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు

ఆలమూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు శనివారం మారేడుమిల్లిలోని గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ద్వారా విద్యార్థులు సేకరించిన దుస్తులను బస్సుల్లో తరలించి అక్కడి గిరిజనులకు అందించారు. గిరిజనులకు పంపిణీలో విద్యార్థులు, తల్లిదండ్రుల కృషి అభినందనీయమని స్కూల్ డైరెక్టర్ ముల్లారావు అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ


వెదురుపాకలో వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

రాయవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గ్రామంలో డొక్కా సీతమ్మ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో 100 మంది వృద్ధులకు శనివారం దుప్పట్లు, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు తాడి బుల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా ప్రతి సోమవారం డొక్కా సీతమ్మ అన్నదాన ట్రస్టు ద్వారా వృద్ధులు, పేదలకు భోజనం అందించడంతో పాటు కార్తీక మాసం నెలరోజులపాటు వృద్ధులకు ఆహార పొట్లాలు అందించామన్నారు. ఈసందర్భంగా గ్రామంలో 100 మందికి ఆహార పొట్లాలు, దుప్పట్లు, పండ్లు, స్వీట్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

చిరుజల్లులు, ఈదురుగాలులతో

రైతుల ఆందోళన

ఆత్రేయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు కలవరపడుతున్నారు. శనివారం చిరుజల్లులు, ఈదురుగాలులతో ఖరీఫ్ సాగు చేసిన రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే 60 శాతం వరికోతలు పూర్తి కావడంతో రైతులు కల్లాల్లో ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. మరికొన్ని కోతలు కోయాల్సి ఉండగా తుఫాన్ హెచ్చరికతో వాయిదా వేసుకున్నారు. ఉదయం ఈదురుగాలులతో పాటు చిరుజల్లులు కురవడంతో కల్లాల్లో ధాన్యాన్ని ఒబ్బిడి చేసి బరకాలతో రక్షణ చర్యలు చేపట్టారు. తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో రమేష్‌రామన్ రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

మండపేట: తుఫాను కారణంగా మండపేట పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలు లతో కూడిన వర్షం కురిసింది. వరికోతలు పూర్తయిన నేపథ్యంలో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో కళ్లాల్లో వున్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. బరకాలతో వాటిని కప్పి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. శుక్ర వారం రాత్రి నుంచి వాతావరణం లో వచ్చిన మార్పులతో అన్న దాతల్లో ఆందోళన నెలకొంది. ధాన్యం తడిసి పోకుండా రైతు సేవా కేంద్రాలు, రైస్ మిల్లులకు శనివారం తరలించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వరికోతలు ముగింపు దశకు వచ్చిన సమయంలో ఈ తుఫాన్ రైతుల్లో కలవరానికి గురి చేస్తోంది.

కొత్తపేటలో: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా అవిడిలో కోతలు పూర్తి చేసుకున్న రైతులు పంటను రక్షించుకునేందుకు అవస్థలుపడుతున్నారు. ధాన్యాన్ని కప్పేందుకు సరైన బరకాలు లేక ఇబ్బందులుపడ్డారు. అవిడిలో శనివారం కురిసిన వర్షానికి బరకాలపై పడిన నీటిని రైతులు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా ఏవో పద్మలత మాట్లాడుతూ మండలంలో 7,421 ఎకరాల్లో వరి పండించగా ఇప్పటికే 3,700 ఎకరాల్లో పంటను రైతులు ఒబ్బిడి చేసుకున్నారని తెలిపారు. బరకాలు సొంతంగా సమకూర్చుకోవాలని ప్రస్తుతం అందుబాటులో లేవన్నారు.

రావులపాలెం: మండలంలో పంట పొలాలు కోత దశలో ఉన్న తరుణంలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం నుంచి గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల పంటపొలాలు నెలకొరిగాయి. ఇప్పటికే కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు బరకాలతో కప్పి భద్రపరుస్తున్నారు.


ఆత్రేయపురం మండలం మెర్లపాలెం-లొల్ల ప్రాంతాల్లో ధాన్యం బస్తాలపై బరకాలు కప్పుతున్న రైతులు

అనంతకుమారి పూజలు

అంతర్వేది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. అర్చకులు, అధికారులు ఆమెకు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

అపార్ నమోదు సమయం పెంచాలి

ఎమ్మెల్సీ ఐవీ

రాయవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అపార్ నమోదు సయయాన్ని పెంచడంతో పాటు దాన్ని సరళతరం చేయాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం రాత్రి రాయవరం మండలం పసలపూడి గ్రామంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న యాప్‌ల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వానికి సూచించామని, పనిదినాలకు నష్టం లేకుండా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. తొలుత యూటీఎఫ్ మండల మహాసభలో పాల్గొని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు నల్లమిల్లి భాస్కరరెడ్డి, గారా చిట్టిబాబు, జి.సీతాదేవి, జి.రాజు, వీవీఎస్ఆర్ మూర్తి, మురళీకృష్ణతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన యూటీఎఫ్ నేతలు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


డీఈఈకి వినతిపత్రం ఇస్తున్న చెల్లూరు గ్రామస్తులు

లైన్‌మెన్లను నియమించాలి

రాయవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో ఒక్కరే లైన్‌మెన్ ఉండటంతో విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరో ఇద్దరు లైన్‌మెన్లను నియమించాలని కోరుతూ విద్యుత్‌శాఖ డీఈఈకి శనివారం వినతిపత్రం ఇచ్చినట్లు మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో చెల్లూరులో ముగ్గురు లైన్‌మెన్లు ఉండే వారని కొన్నేళ్లుగా ఒక్కరే లైన్‌మెన్ ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తనతోపాటు గ్రామస్తులు డీఈఈకి వినతిపత్రం ఇచ్చామన్నారు.

ఆలయంలో హైకోర్టు జస్టిస్ పూజలు

అంతర్వేది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి హైకోర్టు జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శనివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ అందించారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.10,116 విరాళం

అయినవిల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీవిఘ్నేశ్వరస్వామి అన్నప్రసాద ట్రస్టుకు రాజమహేంద్రవరం దివాన్‌చెరువుకు చెందిన కె.తిరుమల కృష్ణారావు కుటుంబం రూ.10,116విరాళం అందజేశారు.



మున్సిపల్ సమావేశానికి హాజరైన చైర్‌పర్సన్ రాణి, కమిషనర్ రంగారావు, సభ్యులు

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

అజెండా లేకుండానే బిల్లులు ఆమోదం

మండపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కౌన్సిలర్లు ఎవరూ రాజకీయ అంశాలను ప్రస్తావించకూడదని కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. కేవలం సాధారణ, అత్యవసర సమావేశాలు పేరిట రెండు అజెండాలను ప్రవేశ పెట్టి ఆమోదించారు. మున్సిపాల్టీలో పనిచేసే ముగ్గురు ఉద్యోగుల ఉద్యోగ విరమణకు సంబంధించిన బిల్లులు ఆమోదించారు. పట్టణంలో గృహాలకు సంబం ధించిన ఇంటి పన్నులు పెంచేశారని టీడీపీ కౌన్సిలర్ చుండ్రు చిన సుబ్బారావు చౌదరి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల కోడ్ ఉన్నందున అవేమీ మాట్లాడకూడదని కమిషనర్ తెలిపారు. కౌన్సిల్ ముగించామని చైర్‌పర్సన్ చెప్పటంతో సభ్యులంతా వెళ్లిపోయారు. సమావేశంలో కమిషనర్ రంగారావు, సభ్యులు, అధికారులు తదితరలుఉ పాల్గొన్నారు.

పేదల పక్షాన నిరంతర పోరాటం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాడేందుకు కృషి చేద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.దుర్గాప్రసాద్ కోరారు. శనివారం చెలికాని రామారావు స్మారక భవనంలో గుర్రాల పరంజ్యోతి 19వ వర్ధంతి సభ జరిపారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సభలో దుర్గాప్రసాద్, ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రాఘవులు తదితరులు మాట్లాడారు. ముందుగా పరంజ్యోతి చిత్రపటానికి నివాళులర్పించారు. సభలో పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న, సత్తిబాబు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జె.సత్యవేణి, మడికి దుర్గారావు, పి.గురుమూర్తి, డి.ప్రసాద్. డి.మనోజ్, గణేష్‌రాజు, రాంబాబు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పరంజ్యోతి వర్ధంతి సభలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ



కొత్తపేట ప్రభుత్వాసుపత్రి వద్ద హెచ్‌ఐవీ అవగాహన ర్యాలీ

కొత్తపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి ఐసీటీసీ ఆధ్వర్యంలో అవిడి పీహెచ్‌సీ సిబ్బందితో అవగాహన ర్యాలీ జరిపారు. ర్యాలిలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ హెచ్‌ఐవీపై అవగాహన కల్పించడమే ర్యాలీ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వీరబాబు, దేవిజనని, ఎం.దుర్గాప్రసాద్, ఎ.వెంకటరత్నం, వి.సద్గుణరావు, సాయిశ్రీ, మమత, సిబ్బంది ఆశావర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. కొత్తపేట ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ఎండీ ప్రసాద్, ఎస్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, జువాలజీ, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ కె.సౌజన్య సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన జరిపారు. అనంతరం విద్యార్థులు మానవహారం ఏర్పడి ర్యాలీ చేశారు.

సమాజానికి యువత ఆదర్శంగా నిలవాలి

రావులపాలెం: సమాజానికి యువత ఆదర్శంగా నిలవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన


రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మానవహారం

ఉన్నత పాఠశాల ఆవరణలో కార్తీక వన భోజనాలు

కె.గంగవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం కార్తీక వన సమారాధన జరిగింది. తొలుత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు, పీవీ బ్రహ్మానందం, కె.శ్రీనివాసు, ఏడుకొండలు, రాఘవ, కుమారి, శ్రావణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల ఆవరణలో ఉసిరిచెట్టుకు పూజలు చేస్తున్న దృశ్యం

పీఎం ఆవాస్ యోజనకు దరఖాస్తు చేసుకోండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గృహ నిర్మాణం చేసుకునే అర్హులు ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి సుభాష్ కోరారు. ఇల్లు లేని పేదలకు ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన 2.0 పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. పూరిపాక, పెంకుటిల్లు, వసతిగృహంలో ఉంటూ సొంత స్థలం కలిగిన వ్యక్తులు ఈ పథకానికి అర్హులన్నారు. ఇంటి పునాదుల వరకు నిర్మాణం చేసుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, పొజిషన్ సర్టిఫికెట్లు జిరాక్స్ ప్రతులతో గృహ నిర్మాణ శాఖ కార్యాలయం, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంటుతో డిసెంబరు 15లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. మంత్రి కార్యాలయం నుంచి దీనిపై పత్రికా ప్రకటన విడుదల చేశారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామంలో ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో దాడులు జరిపారు. ఉచ్చిలికి చెందిన ఉర్రింకల సత్యనారాయణ ఐదు లీటర్ల నాటుసారా తరలిస్తుండగా కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు

అనర్హుల పింఛన్లపై చర్యలు తీసుకోవాలి

రాయవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రూ.15వేలు దివ్యాంగ పింఛన్ పొందుతున్న అనర్హులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు దివ్యాంగ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సభలో కొంత మంది దివ్యాంగులను తప్పుదోవ పట్టించేలా ఒక పార్టీ సభ్యత్వం తీసుకోవాలని చెప్పడం తగదన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకుంటేనే పథకాలు అందుతాయని దివ్యాంగుల్లో భయాందోళనలు సృష్టించడం తగదన్నారు.

94 శాతం పింఛన్ల పంపిణీ: మండలంలో 19 గ్రామ సచివాలయాల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం జరిపారు. మండలంలోని 19 సచివాలయాల పరిధిలో 10వేల 174 మంది పింఛన్‌దారులు ఉండగా వేకువజాము నుంచే లబ్ధిదారులకు అధికారులు, సిబ్బంది పింఛన్లు అందించారు. మండలంలో 94 శాతం పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీవో కీర్తి స్పందన తెలిపారు.


సభ్యత్వం అందిస్తున్న రిష్వంత్‌రాయ్

ముమ్మరంగా తెలుగుదేశం సభ్యత్వ నమోదు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతోంది. క్లస్టర్‌ల వారీగా ఇన్‌చార్జిలు, కార్యకర్తల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు వేగవంతం చేశారు. క్లస్టర్ 2లో క్లస్టర్ ఇన్‌చార్జి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ ఆధ్వర్యంలో పట్టణంలో 6,300 సభ్యత్వాలు దాటి నమోదయ్యాయి. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కంచుమర్తి బాబూరావు, పడాల బాబి, సి.వాసు, ఏసుదాసు, టేకుమూడి రామకృష్ణ, కవల నానాజీ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

మండపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ జరిపారు. సోషల్ యాక్టివిటీస్‌లో భాగంగా విద్యార్థులకు దీన్ని నిర్వహించామని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పలు రకాల వంటకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోదాములు పరిశీలించిన కలెక్టర్

ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల భద్రతకు సంబంధించి తగిన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల గోదాములో భద్రపరిచిన విషయం విదితమే. నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల సీల్లును తనిఖీచేసి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈవీఎంలకు భద్రతకు సబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నెలకు ఒకసారి ఈ వీఎంల గోదాములను తనిఖీ చేస్తామన్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎంల గోదామును తనిఖీచేసి సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి పంపిస్తామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్డీవో మధన్మోహనరావు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, పోలీసు అధికారులు ఉన్నారు.